ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



'టెట్'కు 117 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 4 : జిల్లాలో సోమవారం జరిగిన టెట్ పరీక్షలకు ఉదయం 331 మంది, మధ్యాహ్నం 585 మంది అభ్యర్థులు హాజరైనట్టు డీఈవో ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. 117 మంది గైర్హాజరయ్యారు.



పంచేవాడినే.. వంచండి!

వలంటీర్లతో వైసీపీ నేతల క్రీడ

- వారి విధుల్లోకి వీరే పరకాయ ప్రవేశం
- సంక్షిప్త సందేశాల నుంచి పంపిణీల వరకు వీరిదే పెత్తనం
- ఎన్నికల ముందే సీన్‌లోకి వైసీపీ
- ప్రతిపక్షాలపై పరోక్ష దాడులు
- కీలక నియోజకవర్గాల్లో వక్ర ఎత్తుగడలు

అధికారంలో వున్నన్నాళ్లు ఆసాంతం వినియోగించుకోవాలనేదే అధికార వైసీపీ ఎత్తుగడ. అందుకనే ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ఎంత వీలైతే అంతమేర బహుమతుల పంపిణీ దగ్గర నుంచి పింఛన్‌లు చేతికందించే వరకు వీరంతా చెలరేగిపోతున్నారు. ఇప్పటికే వలంటీర్ల గ్రూపుల్లోకి చొరబడి ప్రైవేటు సమాచారాన్ని రాబట్టడమే కాకుండా పార్టీ పరంగా యాగీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. వలంటీర్ల వ్యవస్థపై ఇప్పటికే ఫిర్యాదులు ఎన్నికల కమిషన్‌కు చేరాయి. అయినా మాకేంటి ... అనే ధీమాతోనే వైసీపీ అనుకూలురు రెచ్చిపోతు న్నారు. ఈ తరహా తీరుపై టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పశ్చిమ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఎన్నికలకు కొద్దిరోజులే మిగిలివుండగా, ఏదో రూపంలో ఓటర్లను తమదారికి తెచ్చుకునేందుకు ఇప్పటి నుంచే అధికార వైసీపీ ఎత్తుగడలు వేస్తోంది. బెదిరింపులకు దిగుతోంది. ఆది నుంచి వలంటీర్ల వ్యవస్థపై వైసీపీయేతర పక్షాలన్నీ అనుమానాలు వ్యక్తం చేస్తూనే వున్నాయి. ఓటర్లను తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి వలంటీర్లను ఒక అస్త్రంగా వాడుకోవడానికి వెనుకాడడం లేదు. ఎమ్మెల్యేలే కాదు.. ఆఖరికి నియోజకవర్గ ఇన్‌చార్జిలు పార్టీ హోదాలోనే పెత్తనం చేస్తున్నారు. చాన్నాళ్లుగా ప్రత్యక్ష, పరోక్ష సంకేతాలు అదీ తెలుగుదేశానికి వ్యతిరేకంగా కొందరు పనిగట్టుకుని పనిచేస్తున్నా ఎక్కడా సరైన చర్యే లేదు. కొన్నాళ్ల క్రితం ఓటర్ల జాబితా సవరించినప్పుడు తగ్గట్టుగా నమోదుకు ఓటర్లు సిద్ధపడినా, ఇప్పటికీ జాబితాలోకి ఆ పేర్లు చేరలేదని చెబుతున్నారు. గ్రామ స్థాయిలో ఇప్పటికే ప్రభుత్వ పథకాల కింద లబ్ధి పొందే వారందరినీ వలంటీర్లు ఎప్పుడో గుప్పెట పెట్టుకున్నారు. తెలుగుదేశం అనుకూలురైతే ఇప్పటికైనా మారండి.. పథకాలన్నీ వైసీపీ అధికారంలో వున్నా మీకు కూడా అందాయి.. అంటూ తెలిసినవారికి మౌఖికంగా చెబుతూనే వస్తున్నారు. జగనన్న కాలనీలు ఏర్పాటైనప్పుడు అప్పటికే టిడ్కో ఇళ్లకు లబ్ధిదారులుగా వున్నవారిని అదిలించి బెదిరించి టిడ్కో ఇళ్ల సంగతి పక్కనబెట్టండి... కాలనీల్లో స్థలం తీసుకోండంటూ ఒత్తిడి చేశారు. ఇదంతా కొంతమంది వైసీపీ ముసుగులో వున్న వలంటీర్లు చేస్తున్న పనే. వివిధ పథకాల్లో ఎవరినైనా చేర్చాలంటే ఎమ్మెల్యేతో పనే లేదు. కేవలం వలంటీర్లు, గ్రామ, వార్డు , సచివాలయ వ్యవస్థలో వున్నవారంతా ఓకే అంటేనే ఎవరికైనా పనైనట్లే. ఇప్పుడిది కాస్తా వెర్రితలలు వేసి వైసీపీ అనుకూల ప్రచారానికి దారి తీస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే వలంటీర్లందరినీ వైసీపీ సర్కార్ ఆకాశానికెత్తేసి అంతా మీకే సాధ్యమంటూ వారందరినీ కార్యకర్తలుగా మార్చేసింది. వైసీపీ ఆదేశాలు తూచా తప్పకుండా క్షేత్రస్థాయికి చేరుతున్నాయి. ఓటరు నమోదు దగ్గర నుంచి పింఛన్ పంపిణీ వరకు ఇంతకు ముందు బాధ్యతగా వ్యవహరించిన వలంటీర్లలో కొందరిని హైజాక్ చేశారు. వలంటీర్ల చేతుల మీదుగా ఇవ్వాల్సిన వాటిని వైసీపీ నేతలే ఫొటోలకు ఫోజులిచ్చి మరీ పంపిణీ దిగుతున్నారు. పాలకొల్లు నియోజక వర్గంలో వైసీపీ ఇన్‌చార్జి అన్నింటా జోక్యం చేసుకుంటున్నారు. స్థానిక నేతలైతే వారే అంతా తామన్నట్లుగా పంపిణీకి దిగుతున్నారు. తన నియోజకవర్గంలో జరుగుతున్న తాజా సీన్‌పై ఎమ్మెల్యే రామానాయుడు సోమవారం పశ్చిమ గోదావరి స్పందనలో ఫిర్యాదు చేశారు. మరికొందరు టీడీపీ ఇన్‌చార్జులు దీనికి సంబంధించి ఆధారాలు, వీడియో ఫుటేజ్‌లతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతున్నారు. కొందరు వలంటీర్లు తమ గ్రూపుల్లో తెలుగుదేశం వ్యతిరేక ప్రచారం ఆరంభించినట్టు చెబుతున్నారు. పాలకొల్లే కాదు, ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, తణుకు, ఆచంట వంటి నియోజక వర్గాల్లోనూ ఇదే పరిస్థితే. వైసీపీ అధికారంలో వుంటేనే అన్ని సవ్యంగా వుంటాయని, లేదంటే టీడీపీ వస్తే అన్నీ గోవిందా అన్నట్టుగా ప్రచారం చేస్తూ ఓటర్లను నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు.

ఇంకా మున్ముందు ...

ఎన్నికలు దగ్గరపడేకొద్దీ ఒకవైపు ఓటర్లు వైసీపీకి వ్యతిరేకంగా వుంటే వారిని లొంగదీసుకోవడానికి మున్ముందు వలంటీర్ వ్యవస్థనే వాడుకోనున్నారని చెబుతున్నారు. ఈ పరిస్థితి ఇప్పటికే కొన్ని నియోజక వర్గాల్లో శృతిమించి కనిపిస్తోంది. మరికొన్ని నియోజకవర్గాల్లో ఎవరింట్లో ఎన్ని ఓట్లున్నాయి... వారంతా ఏ పార్టీకి చెందినవారు.. నగదుకు లొంగుతారా... లేకుంటే బెదిరింపులతో దారికి తెచ్చుకోవచ్చా.. అనే కోణంలో ఎత్తుగడలకు పదును పెడుతున్నారు. జనసేన అనుకూలురు ఆ పార్టీవైపు పైకి మొగ్గు చూపినా అంతర్గతంగా తమ డైరెక్షన్‌లోనే పనిచేసేలా ఇంకో వ్యూహం సిద్ధం చేస్తున్నారు. వీటి వెనుక కూడా గ్రామ సచివాలయాలు వలంటీర్ల మద్దతుతోనే పని పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'మేం చేయాల్సిందంతా చేస్తాం.. మా పార్టీ గెలవాల్సిందే.. ఎంతిచ్చామని కాదు... ఇప్పటివరకు మేం చేసి న సేవను చూసైనా మాకు ఓటేసేందుకు అందరూ సిద్ధం కావాల్సిందే..' ఇది వైసీపీ నేతల అంతర్ముఖంగా కనిపిస్తోంది. మున్ముందు మరింత తెగింపుతో ముందుకెళ్తారనే భావన అందరిలోనూ వుంది.

కలెక్టర్‌కు ఎమ్మెల్యే నిమ్మల ఫిర్యాదు



పాలకొల్లు/భీమవరం టౌన్, మార్చి 4 : పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో పలుచోట్ల వలంటీర్లకు బదులుగా వైసీపీ నేతలే పింఛన్లు పంపిణీ చేయడంపై ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. ఈ మేరకు 'వైసీపీ నేతల చేతుల్లో పింఛన్ల సొమ్ము' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. వైసీపీ నాయకులు పింఛన్ల సొమ్మును లబ్దిదారులకు పంచుతూ ప్రచారం చేశారు. దీనిపై ఎమ్మెల్యే నిమ్మల సోమవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి ఫిర్యాదు చేశారు. బాధ్యులైన మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 48 గంటల్లో దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు.



ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేరాలంటే..

ఫ్యాను పట్టుకెళ్లాల్సిందే..!

- పని చేయని ఫ్యాన్లు, ఏసీలు.. రోగుల పాట్లు
- నిండుగా నిధులు ఉన్నా సౌకర్యాలు నిల్

ఏలూరు క్రైం, మార్చి 4 : అక్కడ ఫ్యాన్లు, ఏసీలు ఉన్నా కేవలం చూడడానికే మాత్రమే.. పని చేయవు. ప్రాణపాయ స్థితిలో కొట్టుమిట్టాడే రోగులు ఐసీయూ విభాగంలో ఫ్యానులు లేక, ఏసీలు పనిచేయక తల్లడిల్లిపోతున్నారు. కొందరి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వారిని చూడడానికి వెళ్లిన వారుకూడా పది నిముషాలు ఉండలేక పోతున్నారు.. ఇది ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి దుస్థితి.

వేసవి వచ్చేసింది. ఎండలు పెరిగి ఉక్కపోత మొదలవుతోంది. ఆరోగ్య వంతులే ఈ వాతావరణం తట్టుకోవాలంటే ఆపసోపాలు పడుతూ ఉంటారు. రోగుల పరిస్థితి అంటే ఇక చెప్పాల్సిన అవసరం లేదు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పేరుకే గొప్ప- అక్కడ సౌకర్యాలు శూన్యమే. అన్ని విభాగాలకు వైద్యులు, సిబ్బంది నిండుగా ఉన్నా సౌకర్యాలు లేక సేవలు రోగులకు అందడం లేదు. వైద్య విధాన పరిషత్‌లో ఉండగా ఆస్పత్రిలో 550 పడకలు ఉండగా అదనంగా 100 పడకలు ఏర్పాటు చేసి రోగులకు మెరుగైన సేవలు అందించేవారు. జాతీయ స్థాయిలోనే ఉత్తమ ఆస్పత్రిగా అవార్డులు పొందారు. రాష్ట్ర స్థాయిలోను అదే విధంగా రెండు పర్యాయాలు పొందారు. ఇక ఆరోగ్య శ్రీ ఆపరేషన్లు ఎన్నో జరిగాయి. ఆరోగ్య శ్రీ నిధులు ఎన్నో నిధులు ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి జమ అయి ఉన్నాయి. గతేడాది ఏప్రిల్ 26న మెడికల్ కాలేజీగా అనుమతి ఇచ్చి 150 ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం సీట్లు భర్తీకి నేషనల్ మెడికల్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. 550 పడకల ఆస్పత్రిని వైద్య విధాన పరిషత్ నుంచి తొలగించి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో కలిపేసింది. మొదటి సంవత్సరం మెడికల్ కళాశాలకు అనుబంధ ఆస్పత్రికి 300 పడకలు మాత్రమే ఉండాలనే నిబంధనలు ఉండడంతో 250 పడకలను రద్దు చేసేశారు. ఇప్పుడు ఆస్పత్రిలో 300 పడకలు ఉండగా వీటిలో 100 పడకలు తల్లి బిడ్డ విభాగాలకు, మిగిలిన అన్ని రకాల విభాగాలకు 200 పడకలు మాత్రమే ఉన్నాయి. ఈ ఉన్న పడకలకు సౌకర్యాలు అంతంత మాత్రం గానే కనిపిస్తున్నాయి. ఆస్పత్రిలో రోగి చేరాలంటే ఖచ్చితంగా వారితో పాటు స్టాండ్ ఫ్యాను తీసుకెళ్లాల్సిందే. ఈ ఫ్యాను పెట్టుకోవాలంటే ఆస్పత్రి అధికారుల అనుమతి తీసుకోవాల్సిందే. ఐసీయూలోను, ఆస్పత్రి అత్యవసర విభాగంలో ఉన్న ఎమర్జెన్సీ బెడ్స్ వద్ద ఏసీలు పనిచేయడం లేదు. రోగులు నరకయాతన పడుతున్నారు. మామూలు వార్డుల్లోను కొన్ని ఫ్యాన్లు పని చేయక ఇదే పరిస్థితి నెలకొంది. నిత్యం వార్డు సిస్టర్స్ (నర్సులు) మెమోలు రాస్తూ సంబంధిత ఆర్ఎంవోకి పంపిస్తూనే ఉన్నారు. కేవలం అవి చూడడానికి మాత్రమే పనికి వస్తున్నాయి కాని ఆ సమస్యలు పరిష్కారానికి ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. సాధారణంగా ఆస్పత్రి డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశంలో ఈ సమస్యలపై చర్చించి ఆస్పత్రి ఉన్న నిధులతో సమకూరుస్తారు. నిధులు సమృద్ధిగా ఉన్నా వాటిని సరైన మార్గంలో వినియోగించడానికి ఏ ఒక్కరు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఆస్పత్రి ఆదాయం సిటీ స్కాన్ విభాగం మీద, ఆస్పత్రిలోని వివిధ విభాగాల నుంచి, క్యాంటీన్ నుంచి, మోడల్ డెయిరీ వంటి వాటి నుంచి అద్దె రూపంలో లక్షలాది రూపాయలు ఉన్నాయి. కొన్ని బాకీలు లక్షల్లో పేరుకుపోయినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. నిధులు ఉన్నా రోగులకు ఎందుకు సౌకర్యాలు కల్పించడం లేదని అడిగే నాథుడే లేడు. రోగుల ఇబ్బందులను అధికారులు, ప్రజా ప్రతినిధులు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకుని ఆస్పత్రి నిధుల నుంచి రానున్న వేసవిని తట్టుకునే విధంగా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రోగులు కోరుతున్నారు.


రోగుల కోసం ఇంటి వద్ద నుంచి ఇలా ఫ్యానులు తెచ్చుకోవాల్సిందే..

ఎందుకిలా..?



- ఇంటర్ ఇన్విజిలేషన్ విధుల నుంచి 300 మందికి పైగా ప్రభుత్వ ఉపాధ్యాయుల తొలగింపు
- వారిస్థానే ప్రైవేటు కళాశాలల అధ్యాపకుల నియామకం
- పరీక్షల పారదర్శకతపై సందేహాలు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 4 : ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్ పరీక్షల నిర్వహణ సిబ్బంది నియా మకాలపై పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు తీసుకున్న ఓ వింత నిర్ణయం విమర్శలకు తావిస్తోంది. ఇంటర్మీడియట్ పరీక్షలకు ఇన్విజిలేషన్ విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్‌చేసి వారిస్థానే ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులను ఇన్విజిలేటర్లుగా నియమించుకోవాలని ఉన్నతాధికారులు ఆదివారం పంపిన ఆదేశాల మేరకు జిల్లాలో 300 మందికి పైగా టీచర్లను విధుల నుంచి ఆగమేఘాలమీద రిలీవ్‌చేసి ఆ బాధ్యతలను జూనియర్ లెక్చరర్లకు అప్పగించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని పలువురు తప్పుబడుతున్నారు. ఉన్నతాధికారుల ఉత్తర్వులను సమర్థించేవారూ లేకపోలేదు. వివరాలు ఇలాఉన్నాయి.

'పది' బోధనపై ప్రభావం పడుతోందంటూ....

పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టులను బోధించే టీచర్లను ఇంటర్ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా నియమిస్తుండడంవల్ల 'పది' పరీక్షార్థులపై తీవ్రప్రభావం పడుతోందన్న కారణంతో టీచర్లను ఇన్విజిలేషన్ విధుల నుంచి తప్పించాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఇంటర్ పరీక్షల ఇన్విజిలేషన్ విధులకు ప్రాథమిక పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)గా పనిచేస్తున్న ఉపాధ్యాయులను మాత్రమే ఇన్విజిలేటర్లుగా నియమిస్తుంటారు. మండలాల వారీగా అవసరమైన ఇన్విజిటర్ల సంఖ్యకు అనుగుణంగా ఎస్జీటీలను కేటాయించాల్సిందిగా ఎంఈవోలకు ఇంటర్ బోర్డు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు ప్రతిపాదనలు ఇవ్వడం, వాటిని యథాతథంగా ఆమోదించి సిబ్బందిని ఇవ్వడం ఏటా జరిగేదే. ఇంటర్ సబ్జెక్టులు బోధించేవారిని, మరీ ముఖ్యంగా ప్రైవేటు కళాశాలల అధ్యాపకులను ఇన్విజిలేటర్లుగా నియమిస్తే పరీక్షల్లో అవకతవకలకు అవకాశం ఉంటుందని, పారదర్శకతకు సమస్యలెదురవుతాయనే ముందస్తు జాగ్రత్తలతో గతం నుంచి ఈ విధంగా వ్యవహరిస్తున్నారు. ఎస్జీటీలైతే ఇంటర్ సబ్జెక్టులపై అవగాహన లేకపోవడం, మరోవైపు ప్రభుత్వ ఉపాధ్యాయులైనందున బాధ్యతాయుతంగా జవాబుదారీతనంతో కూడిన విధులు నిర్వర్తిస్తారనే భావనతో ఈ విధానాన్ని దశాబ్దాల కాలంగా అమలు చేస్తున్నారు. దీనికి భిన్నంగా ఉన్నతాధికారులు తాజాగా తీసుకున్న నిర్ణయంపై విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏలూర జిల్లాలో ప్రస్తుతం ఇంటర్ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా నియమితులైన మూడొందలకు పైగా ప్రభుత్వ పాఠశాలల టీచర్లను తొలగించి సోమవారం ఆయా ప్రైవేటు కళాశాలల అధ్యాపకులను ఇన్విజిలేషన్ విధులకు ఇంటర్‌బోర్డు నియమించింది.

భిన్నాభిప్రాయాలు ఇలా...

ఇంటర్ పరీక్ష కేంద్రాన్నింటిలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు లైవ్‌స్ట్రీమింగ్‌తో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ స్టేషన్ ద్వారా జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పర్యవేక్షిస్తున్నందున ప్రైవేటు అధ్యాపకులను నియమించినా పారదర్శకతకు ఎటువంటి లోపం ఉండబోదని అధికారులు ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నారు. ఆ మేరకు విద్యా సంవత్సరం ఆరంభంలోనే ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో సబ్జెక్టుల వారీగా బోధించే అధ్యాపకుల పేర్లు, అర్హతలు, ఇతర వివరాలన్నీ ఇంటర్ బోర్డు వద్ద నమోదు చేస్తున్నందున, ఈ వివరాల నుంచే ప్రస్తుతం పరీక్షలకు ఇన్విజిలేటర్లను నియమిస్తున్నందున అనర్హులను నియమించడంగాని, వారు అవకతవకలకు పాల్పడతారనే భయాందోళనలు వ్యక్తమయ్యే అవకాశమే లేదని చెబుతున్నారు. వీటితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఉంటాయని అధికారులు వివరిస్తున్నారు. అయితే ఇన్విజిలేషన్ విధులను ప్రైవేటు కళాశాలల అధ్యాపకులకిస్తే పరీక్షలు లోపభూయిష్టంగా తయారవుతాయని మరికొందరు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి పదో తరగతి సబ్జెక్టులను బోధించేది స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు చెందిన ఉపాధ్యాయులని, ఇంటర్మీడియట్‌తో సంబంధంలేని ఎస్జీటీలనే నియమించి నప్పుడు హడావుడిగా వారిని తొలగించి ఇంటర్మీడియట్ సబ్జెక్టులను బోధించే అధ్యాపకులను నియమించడంలో అంతరార్థం ఏమిటని ఇంకొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పదోతరగతి సబ్జెక్టుల బోధనకు విఘాతం కలుగుతుందనుకుంటే స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లుంటే తొలగించడం తప్పుకాదని, అదే కారణమైతే ఎస్జీటీలను, స్కూల్ అసిస్టెంట్లను సెంటర్ క్లాసుల నుంచి, కాంప్లెక్స్ సమావేశాల నుంచి, ఎన్నికల విధుల శిక్షణ తరగతుల నుంచి తప్పిస్తారా? వారిని తరగతి గది బోధనకే పరిమితం చేయవచ్చుగదా? అని ప్రశ్నించేవారూ లేకపోలేదు.

30 ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు

జిల్లాలో ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొత్తం 51 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేయగా 32,445 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 30 ప్రైవేటు కళా శాలల్లో పరీక్షా కేంద్రాలున్నాయి. విద్యార్థులను జంబ్లింగ్ విధానంలో ఆయా కళాశాలలకు కేటా యిస్తారు. ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి 25,908 మం ది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలు ప్రారంభమై రెండురోజులు గడిచిన నేపథ్యంలో ఇంటర్ బోర్డు ఆకస్మిక నిర్ణయం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దీనిపై డీవీఈవో, పరీక్షల కన్వీనర్ ప్రభాకరరావుని వివరణ కోసం ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

హౌసింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి : జేసీ

ఏలూరు కలెక్టరేట్, మార్చి 4 : రాష్ట్రప్రభుత్వం నిర్దేశించిన హౌసింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నూరుశాతం పూర్తిచేసి రెండురోజుల్లో నివేదికను అందజేయాలని జేసీ బి.లావణ్యవేణి సంబంధిత అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలతో హౌసింగ్ రిజిస్ట్రేషన్, ఆర్వోఆర్, రీసర్వే గ్రామాలపై సమీక్షించారు. ఆర్వో డి.పుష్పమణి, ఆర్డీవో ఖాజావలీ, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జడ్పీ సీఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో మాక్‌డ్రిల్ నిర్వహించాలి

జిల్లాలోని పరిశ్రమల్లో అనుకోని ప్రమాద సమ యాల్లో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు మాక్ డ్రిల్ నిర్వహించాలని జేసీ బి.లావణ్యవేణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పరిశ్రమల్లో మాక్‌డ్రిల్ నిర్వహణపై వివిధశాఖల అధికారులతో సమీక్షించారు. జేసి మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన ఉంగుటూరు మండలంలోని టైల్స్ పరిశ్రమలో మాక్‌డ్రిల్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

వెబ్‌సైట్‌లో టెన్త్ హాల్‌టిక్కెట్లు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 4 : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల హాల్ టిక్కెట్లను బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత పాఠశాల లాగిన్, పాస్ వర్డ్‌లతో స్కూల్ హెచ్‌ఎంలు వాటిని డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటును సోమవారం నుంచి కల్పించినట్టు వివరించారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ఏలూరు క్రైం, మార్చి 4 : ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలంటూ న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించారు. రాష్ట్ర న్యాయవాదుల మహాసభ తీసుకున్న నిర్ణయం మేరకు ఈ నెల 15 వరకు న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని ఇప్పటికే కొంతకాలం నుంచి న్యాయవాదులు కోర్టులను బహిష్క రిస్తూ రిలే నిరాహార దీక్షలు చేశారు. ఏలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని కోర్టు విధులను బహిష్కరించారు. ఈనెల 15 వరకు ఇదే విధంగా కొనసాగిస్తామని న్యాయవాదులు ప్రకటించారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

టి.నరసాపురం, మార్చి 4 : ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ డీఎస్‌బీ శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలో గల ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలు అప్పలరాజుగూడెం (బాలురు), నాగిరెడ్డిగూడెం (బాలికలు) , ముసునూరు (బాలికలు) పాఠశాలలలో వచ్చే విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి 6, 7. 8 తరగతుల్లో మిగిలిన ఖాళీలకు 100శాతం రుసుముతో ఈ నెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

పూర్తిస్థాయిలో సమస్యల పరిష్కారం : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, మార్చి 4 : రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్జీని నిర్దేశిత గడువులో పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌర సరఫరాలు, పేదలందరికీ ఇళ్లు, పెన్షన్లు, ఇళ్ల ఆక్రమణ, ఉపాధి, భూసర్వే తదితరాలకు సంబంధించి మొత్తం 208 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నాణ్యత ప్రధానమైనదని, జిల్లా స్థాయిలో ఇందుకోసం ప్రత్యేకమిటీ పనిచేస్తోందన్నారు. జేసీ బి.లావణ్యవేణి, డీఆర్వో పుష్పమణి, జడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, ఆర్డీవో ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తనపొలంలో ఎకరం ఆన్‌పోస్టింగ్ తొలగించి పోస్టింగ్ సరిచేసి తన పేరున ఆన్‌లైన్ చేసి అడంగళ్‌లో ఎక్కించాలని కామవరపుకోటకు చెందిన టి.ఏసురత్నం కోరారు. తల్లిద్వారా సంక్రమించిన భూమికి తన పేరున పాస్‌బుక్ ఇప్పించాలని టి.నరసాపురానికి చెందిన కె.నాగేశ్వరరావు, సరిహద్దు దారులు ఆక్రమించుకుని దౌర్జన్యం చేస్తున్నారని, సర్వే చేయించి దారి ఏర్పాటు చేయాలని దెందులూరుకు చెందిన రామ్మోహన్‌రావు, తమ పొలంలోని సర్వేనంబర్ 430లో మూడు ఎకరాలు భూమిని సర్వేచేయించి ఆన్‌లైన్ చేయాలని చాట్రాయికి చెందిన వేణుగోపాల్ వినతులు అందించారు.



తన సమస్యను రోదిస్తూ కలెక్టర్‌కు విన్నవిస్తున్న ఓ మహిళ

మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 4 : ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పేవారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మేరీ ప్రశాంతి సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో 50 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారణ జరిపి త్వరితగతిన సమస్యను చట్ట ప్రకారం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అందిన ఫిర్యాదులపై అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



స్థలం కోసం హోంగార్డు బెదిరిస్తున్నాడు..



ఇంటి స్థలం కోసం హోంగార్డు, వరుసకు మరిది బెదిరిస్తూ స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడు. ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెడుతున్నాడు. పెదపాడు మండలం కొత్తూరుకు చెందిన నేను విద్యుత్‌శాఖలో అటెండర్‌గా పనిచేస్తున్నాను. 2007లో నా భర్త సుబ్బయ్య చనిపోగా ఆ స్థానంలో నాకు ఉద్యోగం ఇచ్చారు. కొత్తూరులో నా భర్తకు తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన ఇంటిస్థలం ఉంది. అయితే నా భర్త పెద్దనాన్న కొడుకైన చిన్నసుబ్బయ్య మా ఇంటికి వచ్చి నీ భర్త రూ.5వేలు అప్పుగా తీసుకున్నాడని, డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చాడు. పెద్దల సమక్షంలో డబ్బు ఇచ్చేందుకు ప్రయత్నించాం. అయితే ఇంటిస్థలం ఆక్రమించేందుకు అతను ప్రయత్నిస్తూ ఇటీవల ఆ స్థలంలోని టేకు, వేపచెట్లు నరికించివేశాడు. ఇదేమని అడిగితే మాపై తప్పుడు కేసులు, ఫిర్యాదులు చేస్తున్నాడు. పోలీసు కేసు పెడితే పట్టించుకోవడం లేదు. నాపై కక్ష పెంచుకుని తప్పుడు కేసులతో పిల్లలకు ఉద్యోగాలు రాకుండా చేస్తానని బెదిరిస్తున్నాడు. న్యాయం చేయండి.

- నున్న పేరంటాలు, కొత్తూరు, పెదపాడు మండలం

పోలీసులు పట్టించుకోవడం లేదు..



గతేడాది నా సోదరుడు దొరబాబు మృతి చెందాడు. మృతిపై అనుమానాలు ఉన్నాయి. కేసును చేధించాలని పోలీసులను కోరినా పట్టించుకోవడం లేదు. నా సోదరుడి మృతికి తల్లితో పాటు మరో ఇద్దరు సోదరులు, మేనమామ కారణం. ఆస్తి పంపకం విషయంలోనే హతమార్చారని పోలీసులకు ఫిర్యాదు చేసినా దివ్యాంగుడైన నా మాట పట్టించుకోవడం లేదు. మీరే న్యాయం చేయాలి.

- ఖుక్యా బాలాజీ , నాగిరెడ్డిగూడెం, చింతలపూడి మండలం

కాల్వపై అక్రమ నిర్మాణం తొలగించండి..



ఏలూరు పాత బస్టాండ్ సమీపంలోని ఆశ్రం హాస్పిటల్‌కు వెళ్లే రోడ్డుకు ఆనుకుని ఉన్న కృష్ణా ప్రధాన కాల్వపై ఒక రియల్టర్ కోసం అక్రమంగా నిర్మిస్తున్న వంతెనను అడ్డుకోవాలి. ప్రజలకు ఉపయోగం లేని చోట వంతెన నిర్మిస్తున్నారు. ఇటీవల కాలంలో దెందులూరు నియోజకవర్గం కొమిరేపల్లి రహదారిపై 11 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. అక్కడ వంతెన నిర్మించాలని స్థానికులు ఆందోళన చేసినా అధికారులు స్పందించలేదు కాని పక్కనే ఉన్న స్థలంలో రియల్ ఎస్టేట్ సంస్థల కోసం వంతెన నిర్మించడం ఎంతవరకు న్యాయం. ప్రధాన కాల్వపై ఇరిగేషన్‌శాఖ వంతెన నిర్మాణానికి ఎలా అనుమతులు ఇచ్చింది తక్షణం వంతెన నిర్మాణం ఆపండి.

- అలగా రవికుమార్, మాల మహాసేన జాతీయ అధ్యక్షుడు

హరహర మహాదేవ

8న శివరాత్రి.. ముస్తాబవుతున్న శైవక్షేత్రాలు



ముస్తాబవుతున్న ఆచంటేశ్వరుడి ఆలయం

శివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలో పలు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసేందుకు అర్చకులు సిద్ధమవుతున్నారు.

ఆచంటేశ్వరుడి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఆచంట, మార్చి 4: ఈ నెల ఆరు నుంచి పది వరకు జరిగే రామేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం లోపల, బయట విద్యుత్ దీపాలతో ప్రత్యేకగా అలంకరించారు. చలువ పందిళ్లు వేశారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ టి.సాగర్, ఆలయ అధికారి రాము, కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల ఆరున స్వామికి ప్రత్యేక పూజలు, దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఏడున వేకువ జామున స్వామి, అమవార్ల కల్యాణం, ఎనిమిదిన మహా శివరాత్రి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలతో స్వామి రథోత్సవం నిర్వహిస్తారు. తొమ్మిదిన స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం, పదిన స్వామికి తిశ్రూలోత్సవం, సాయంత్రం భక్తులకు అమ్మవారి కుంకుమ భరిణలు పంపిణీ చేస్తారు.



లక్ష్మణేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పందిళ్లు

లక్ష్మణేశ్వరుని ఆలయం ముస్తాబు

నరసాపురం రూరల్: మహా శివరాత్రి ఉత్సవాలకు మండలంలోని లక్ష్మణేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతుంది. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో భారీ పందిర్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు సిద్ధం చేశారు. దక్షణ కాశీగా పేరొందిన లక్ష్మణేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ఉభయగోదావరి, కృష్ణా జిల్లా వాసులు ఇక్కడికి పెద్ద ఎత్తున తరలివస్తారు. సుమారు 50 వేల మందిపైగా ఈ ఆలయాన్ని ప్రతి ఏటా దర్శించుకుంటారు. దానికి అనుగుణంగా ఆలయ కమిటి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష

పోలవరం, మార్చి 4 : పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్ల చివరి సమీక్షా సమావేశం మంగళవారం పట్టిసీమ పెర్రీ పాయింట్ వద్ద ఉత్సవ కమిటీ చైర్మన్ జంగారెడ్డిగూడెం ఆర్డీఒ ఆధ్వర్యంలో జరుగుతుందని డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమీక్షా సమావేశం జరుగుతుందని అన్ని శాఖల అధికారులు తమ కార్యాచరణ ప్రణాళికలతో ఈ సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

ప్రజా రవాణాశాఖ అధికారి



ఏలూరు రూరల్, మార్చి 4: మహా శివరాత్రికి ప్రజా రవాణా సంస్థ మార్చి 8న శైవ క్షేత్రదర్శనానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి ఎన్వీఆర్ వర ప్రసాద్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏలూరు నుంచి బలివేకు 50, జంగారెడ్డిగూడెం నుంచి తాడువాయి, పట్టిసీమకు 30 బస్సులు, నూజివీడు నుంచి బలివేకు 20 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఏడాది ఏలూరునుంచి ద్వారకా తిరుమల వెళ్లే సాయిభక్తులకు ద్వారకాతిరుమల నుంచి ఏలూరుకు 25 బస్సులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ బస్సులు 7 నుంచి 9వరకు నడవనున్నట్లు తెలిపారు.



ధ్వజస్తంభం వద్ద నిర్మించిన తాటాకు పందిళ్లు

నేటి నుంచి కల్యాణోత్సవం



ద్వారకా తిరుమల : క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న శివదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 5న స్వామిని పెండ్లి కుమారుడిగా, అమ్మ వార్లను పెండ్లి కుమార్తెగా ముస్తాబు చేస్తారు. 6న పంచగవ్య ప్రాశన, అంకురార్పణ, ధ్వజారోహణ, 7న గామోత్సవం, 8న మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని లింగోద్భవ కాల అభిషేకం, అనంతరం స్వామి దివ్య కల్యాణ మహోత్సవం జరగనున్నాయి. 9న గ్రామోత్సవం, 10న త్రిశూలవారి వసం తోత్సవం, పూర్ణాహుతి, ధ్వజావరోహణ, 11న శ్రీపుష్ప యాగో త్సవం జరుగుతాయని ఈవో త్రినాథరావు వివరించారు.

7న కలశ స్థాపనతో వీరంపాలెంలో ఉత్సవాలు ప్రారంభం



ఆలయంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు



తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 4: వీరంపాలెం శ్రీ బాలాత్రిపుర సుందరి దేవి పంచాయతన క్షేత్రంలో శివరాత్రికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి తెలిపారు. క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7న కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. అదే రోజు భూప్రస్తార శ్రీచక్రార్చన శివరాత్రి రోజున స్ఫటికలింగ స్వామికి మానస సరోవర జలం, 12 నదీ జలాలతో అభిషేకాలు నిర్వహించనున్నారు. మహాదేవునికి మహా కుంభాభిషేకం, ప్రముఖులచే ఆధ్యాత్మిక ఉపన్యాసం ఏర్పాటు చేశారు. అనంతరం శివ పార్వతుల కల్యాణం, లక్ష జ్యోతిర్లింగార్చన, లింగోద్భవకాల అభిషేకం, లక్ష జ్యోతి ప్రజ్వలన చేయనున్నారు. శివరాత్రి రోజు తెల్లవారుజామున ఐదు గంటల నుంచి ప్రతీ ఐదు నిముషాలకు తాడేపల్లిగూడెం డిపో నుంచి ప్రత్యేక బస్సుల సదుపాయం కల్పించామని ఆర్టీసీ డీఎం వై.సత్యనారాయణమూర్తి తెలిపారు. భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిధుల దుర్వినియోగంలో విచారణ చేయాలి



తహశీల్దారుకి వినతిపత్రం ఇస్తున్న మత్స్యకారులు

పోలవరం, మార్చి 4 : ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన నిధులు దుర్వినియోగం చేసి, అవినీతికి పాల్పడిన మత్స్య శాఖ అధికారులపై, అక్రమంగా రుణం పొందిన వ్యక్తిపై సమగ్ర విచారణ చేసి, తగు చర్యలు తీసుకోవాలని గోదావరి బోట్స్ మెన్ అండ్ ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద అవినీతిపై విచారణ చేయాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు ధర్నా చేసి, నినాదాలు చేశారు. డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. పీఎం మత్స్య సంపద యోజనలో 2021-2022లో 40 శాతం సబ్సిడీతో మత్స్యకారులకు సంబంధం లేని ఒక సామాజిక వర్గం వ్యక్తికి రూ.23 లక్షల నిధులు మంజూరు చేశారని, ఎస్సీ ఎస్టీలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని దరఖాస్తు సమయంలో మత్స్యశాఖ అధికారులు నమ్మబలికి ఇప్పుడు మత్స్యకారులకు సంబంధం లేని వ్యక్తికి ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. అక్రమ మార్గంలో రుణం పొందిన, మంజూరు చేసిన, సహకరించిన మత్స్యశాఖ అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, మత్స్యకారులకు నాలుగు చక్రాల వాహనాలకు రుణాలిప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలవరం మత్స్యకార సొసైటీ సభ్యులు మత్స్యకారులు పాల్గొన్నారు.

గోల్డ్‌బాండ్ స్కీమ్‌లో 6.10 కేజీల బంగారం డిపాజిట్



బంగారం ప్యాక్‌ను ఎస్‌బీఐకు అప్పగిస్తున్న అధికారులు

ద్వారకాతిరుమల, మార్చి 4: చిన్న తిరుమలేశుడికి భక్తులతో లభించిన 6.10 కేజీల బంగారాన్ని గోల్డ్ బాండ్ స్కీమ్‌లో సోమవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులకు అప్పగించారు. స్వామి వారికి హుండీల ద్వారా వచ్చిన బంగారు మిశ్రమం, కానుకలని ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు తెలిపారు. ముందుగా స్వామివారి ఆలయ స్ట్రాంగ్ రూములో ఉంచిన వీటిని అధికారుల సమక్షంలో తూచి సీల్‌వేసి ఎస్‌బీఐ అధికారులకు అప్పగించారు. డిప్యూటీ కమిషనర్, ఇంచార్జి ఆర్‌జేసీ విజయరాజు, దేవాదాయశాఖ గోల్డ్ అప్రైజర్, ఏసీ దుర్గాభవాని, ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి అలహసింగరాచార్యులు, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ రమణరాజు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న జేడీ సుబ్రమణ్యం

పెంటపాడు, మార్చి 4: చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రమణ్యం అన్నారు. సోమవారం పెంట పాడు పీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇప్పటి వరకు పల్స్ పోలియో కార్యక్రమం నమోదు శాతంపై ఆరా తీశారు. మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు త్వరతగతిన వేయాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ తోట రాజేష్ కుమార్, డాక్టర్ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్షలో దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 4 : పశ్చిమ గోదావరి జిల్లా సమగ్ర శిక్షలో ఖాళీగా ఉన్న సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులకు ఆసక్తి గల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, డైట్ లెక్చరర్స్, స్కూల్ అసిస్టెంట్‌ల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని సమగ్ర శిక్ష పశ్చిమ గోదావరి జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పి.శ్యామ్ సుందర్ సోమవారం తెలిపారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రంలోపు జిల్లా ప్రాజెక్టు కార్యాలయం, సమగ్ర శిక్ష, పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరానికి పంపించాలని తెలిపారు. దరఖాస్తు వివరాలకు వెస్ట్ గోదావరి.వోఆర్జీ వెబ్‌సైట్ చూడాలన్నారు.

నరసాపురం తెలుగు యువత అధ్యక్షుడిగా పసుమర్తి

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): టీడీపీలో వివిధ అనుబంధ విభాగాల కమిటీల్లో మరికొందరికి స్థానం లభించింది. సోమవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటన జారీచేశారు. నరసాపురం పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడిగా పసుమర్తి వీరవెంకట లక్ష్మణ వర్మ (తాడేపల్లిగూడెం)ను నియమించారు. వాణిజ్య విభాగం రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా టి.దుర్గారావు (చింతలపూడి) నియమితులయ్యారు.

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

ఉంగుటూరు, మార్చి 4: కైకరం పంచాయతీలో సీనియర్ సహాయకుడిగా పని చేయుచున్న మద్ది శేషబాబు జాతీయ రహదారిపై కైకరం శివారులో అదుపు తప్పి పడిపోయాడు. విధి నిర్వహణ అనంతరం ద్విచక్ర వాహనంపై పంచాయతీ కార్యాలయం నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళుతున్న సీనియర్ సహాయకుడు మద్ది శేషబాబు అదుపు తప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

దొడ్డిదారి బదిలీల ఉత్తర్వులు సిద్ధం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 4 : కౌన్సెలింగ్ లేకుండా నేరుగా ప్రభుత్వ ప్రత్యేక ఉత్తర్వులతో ఉమ్మడి జిల్లాలో బదిలీలు తెచ్చుకున్న ఉపాధ్యాయులకు గవర్నమెంట్ ఆర్డర్లు మంగళవారం జారీ అయ్యే అవకాశాలున్నాయి. కొన్ని నెలలక్రితం ప్రభుత్వం నుంచి మూడో జాబితాగా 37 మంది ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలతో కూడిన ప్రతిపాదనలు ఆయా స్థానాలకు బదిలీలనిమిత్తం జిల్లాకు అందిన విషయం విదితమే. ఈ ప్రతిపాదనల్లో పేర్కొన్న పాఠశాలల్లో క్లియర్ వెకెన్సీలు ఉన్నదీ, లేనిదీ క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను పంపాలని అప్పట్లో ప్రభుత్వం విద్యాశాఖను ఆదేశించింది. అధికారిక ప్రతిపాదనలుగా కాకుండా వీటిని వాట్సాప్ బదిలీలుగా ప్రచారం జరిగాయి. వివిధ కారణాలతో తమను బదిలీ చేయాల్సిందిగా పలువురు రాజకీయ నాయకుల సిఫారసులు, మరికొందరు డబ్బులు ఇచ్చుకుని ప్రజా ప్రతినిధులతో లేఖలు సాధించుకున్నట్టు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇవేవీ లెక్క చేయకుండా బదిలీ ప్రతిపాదనలు చాపకింద నీరులా జరిగిపోతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే జిల్లాలో ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలు, షరతుల ప్రకారం ప్రతిపాదిత జాబితాలో 13 నుంచి 20 మంది టీచర్లకు మాత్రమే గవర్నమెంట్ బదిలీలు దక్కే అవకాశాలున్నట్టు సమాచారం. దీనికి భిన్నంగా ఎవరికైనా బదిలీలు ఇచ్చినా సంబంధిత స్కూలులో క్లియర్ వెకెన్సీ లేకపోతే ట్రెజరీ నుంచి జీతభత్యాలు అందే అవకాశాలు లేకపోవడంతో పరిమిత సంఖ్యలోనే బదిలీ ఆర్డర్లు జారీ చేయనున్నారు. మరోవైపు కొందరికి ఏజెన్సీ పోస్టుల్లోను బదిలీ అవకాశం కల్పించినట్టు ప్రచారం జరుగుతోంది. అధికారికంగా ఉమ్మడి జిల్లాలో ఎంతమంది టీచర్లకు గవర్నమెంట్ బదిలీలు జరిగాయన్నది మంగళవారం బహిర్గతమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో ఎంత మందికి బదిలీ ఉత్తర్వులు ఇవ్వాలో సీల్డ్ కవర్‌లో ఆర్జేడీల ద్వారా డీఈవో కార్యాలయానికి పంపినట్టు సమాచారం. అయితే ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించడంలేదు.

విజృంభిస్తున్న సైబర్ నేరగాళ్లు

- ముదినేపల్లిలో పలువురు బాధితులు లబోదిబో
- ఫిర్యాదు చేసినా చర్యలేవి ?.. రికవరీ కాని సొమ్ము

ముదినేపల్లి, మార్చి 4 : సైబర్ నేరాలకు పాల్పడే ముఠా మాటలు నమ్మవద్దని, ఆన్‌లైన్‌లో యాప్‌లు జోలికి పోయి మోసపోవద్దని పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా డబ్బుల ఆశలో పడి విద్యావంతులు సైతం సొమ్ము పోగొట్టుకుంటున్నారు. ముదినేపల్లిలో ఈ నేరాలు ఆరు నెలల కాలంలో మూడు జరిగాయి. స్థానిక ఆడితీ వ్యాపారి ఒకరు ఒక అపరిచిత వ్యక్తి మాటలు నమ్మి వేరే వ్యక్తి అకౌంట్‌లో ఫోన్ పే ద్వారా ఒక రూపాయి వేయగా, నిమిషాల వ్యవధిలోనే ఆ వ్యాపారి ఖాతా నుంచి రూ.69 వేలు మాయమయ్యాయి. దీనిపై సైబర్ క్రైం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేసినా గల్లంతైన సొమ్ము తిరిగి రాలేదు. ఈ సంఘటన మరువకముందే ముదినేపల్లిలో కంటి ఆసుపత్రిని నిర్వహించే ఒక విద్యావంతుడు ఆన్‌లైన్ లింకులో సొమ్ములు వేసి సుమారు రూ.2 లక్షలు పోగొట్టుకున్నారు. నాలుగు రోజుల క్రితం తాజాగా మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి గత నెల 25న పోస్టు ద్వారా వచ్చిన పార్శిల్‌లో ఒక వ్యాపార సంస్థ నిర్వహించిన షోలో రిజిస్టర్డ్ వ్యక్తులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశామని, ఇందులో స్క్రాచ్ కార్డును ఓపెన్ చేయమని ఉంది. దీంతో పంది మోహనరావు అనే ఆ వ్యక్తి కార్డును ఓపెన్ చేయగా, రూ.15.50 లక్షలు మొదటి బహుమతిని మీరు గెలుచుకున్నారు. టీడీఎస్, ఇతర చార్జీల కింద 5 శాతం సొమ్ము చెల్లించాలని బ్యాంక్ అకౌంట్ నంబర్లు ఇచ్చారు. దీంతో ఆ వ్యక్తి రూ.62 వేలు ఇద్దరు వ్యక్తుల ఖాతాలకు పంపారు. అనంతరం అంతకు ముందు మాట్లాడిన వ్యక్తుల ఫోన్ నంబర్లు బంద్ అయ్యాయి. ఇదంతా మోసమని గుర్తించిన మోహనరావు సైబర్ క్రైం పోలీసులకు, ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలా పలు రకాలుగా ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయని ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకుంటూ కూడా సైబర్ నేరస్థుల మాటలను గ్రామీణ ప్రాంత ప్రజలు నమ్ముతూనే ఉన్నారు. కొన్ని సంఘటనలు బయట పడుతుండగా బయటపడనివి ఎన్నో.. ఈ మోసాలకు సంబంధించి బ్యాంక్ అకౌంట్లు ఇతర రాష్ట్రాలకు చెందినవిగా కొన్ని కేసుల్లో బయట పడినప్పటికీ సైబర్ క్రైం విభాగం సొమ్మును తిరిగి రాబట్టే అవకాశాలు లేకుండా పోతున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు కూడా సైబర్ మోసాలు వ్యాపించటం ఆందోళన కలిగిస్తున్నది.

• నమ్మి మోసపోయా



ముదినేపల్లిలోని తన అడితికి వచ్చి నాప రాయి కొనుగోలు చేసినట్లు ఇద్దరు వ్యక్తులు నటించారు. ఒక రూపాయి తమ యజమాని అకౌంట్‌కు ఫోన్ పే చేస్తే సరుకు కొన్న మొత్తం వేస్తారు. అని వారు నమ్మించారు. నేను నా ఫోన్ ద్వారా ఒక రూపాయి వేయగా, పది ని ముషాల్లో నా బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.69 వేలు మాయమయ్యాయి. ఇది జరిగి ఆరు నెలలు గడిచింది. సొమ్ము తిరిగి నాకు దక్కలేదు.

- కోడె వెంకటస్వామి, టింబర్ డిపో యజమాని

• ప్రైజ్ మనీ పేరిట మోసం



ఆన్‌లైన్ యాప్‌లో వస్తువులు, పిల్లల డ్రెస్సులు ఆర్డర్ పెట్టా. వస్తువులు డెలివరీ అయ్యాక సొమ్ము చెల్లించా. అనంతరం లక్కీ డ్రాలో ప్రైజ్ మనీ వచ్చిందంటే నమ్మి టీడీఎస్ ఛార్జీల నిమిత్తం రూ.62 వేలు బ్యాంక్ అకౌంట్‌లో వేశా. గత నెల 26న రూ.15 లక్షలు ఇండియన్ బ్యాంకు నా అకౌంట్‌లో వేశామని ఆ యాప్ నిర్వాహకులు ఫోన్ చేయగా, బ్యాంక్‌కు వెళ్లి చూశాను. అకౌంట్‌లో డబ్బులు జమ కాలేదు. చిన్న రైతునైన నేను కష్టపడిన సొమ్ము పోగొట్టుకున్నా.

- మోహనరావు, సైబర్ క్రైం బాధితుడు, ఊటుకూరు

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, మార్చి 4 : ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని సాయుధ బలగాలతో పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌శాఖ తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ కార్యాలయంలో సోమవారం సాయుధ దళాధిపతులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల నియమాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్పీతో ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎం శేఖర్, ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, టూటౌన్ సీఐ ప్రభాకర్, ఏఆర్ఆర్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మొగల్తూరులో పోలీసుల మార్చ్‌ఫాస్ట్

మొగల్తూరు, మార్చి4: రానున్న ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఏఆర్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ సూచించారు. సోమవారం మొగల్తూరు ప్రధాన వీధుల్లో సీఐఎస్ఎఫ్, సివిల్ పోలీసులు మార్చిఫాస్ట్ నిర్వహించారు. డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ ఓటర్లు ప్రలోభాలకు, భయాందోళనకు గురి కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటర్లకు మనోస్థైర్యం కల్పించేందుకే మార్చిఫాస్ట్ నిర్వహించామన్నారు. సీఐఎస్ఎఫ్ కమాండెంట్ జర్నాల్ సింగ్, అసిస్టెంట్ కమాండెంట్ రామాన్‌జీ, సీఐ గోవిందరాజు, ఎస్ఐ కె.వెంకట రమణ, తహసీల్దార్ భాస్కర్ పాల్గొన్నారు.



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ పోలీసులు

క్రైం కార్నర్

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

ఏలూరు క్రైం, మార్చి 4 : రైలు నుంచి జారిపడి ఒక యువకుడు ప్రమాదవశాత్తు అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నూజివీడు స్టేషన్ దాటిన తరువాత పట్టాలపై ఒక యువకుడి మృతదేహం ఉందని ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. దీంతో రైల్వే ఎస్ఐ నరసింహారావు ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు తెనాలిలోని గంగానమ్మపేట ముస్లిం వీధికి చెందిన నరిశెట్టి సాయిరామ్(27)గా గుర్తించారు. అతను వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

చెరువులో పడి యువకుడి మృతి

పెదపాడు, మార్చి 4 : కొణికిలో చేపల చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి యువకుడు మృతి చెందినట్టు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. పోలీసుల వివరాలివి.. పశ్చిమబెంగాల్‌కు చెందిన షేక్ అమీర్ ఆలీ కొంతకాలంగా కొణికిలో చేపల చెరువుల మీద నివాసముంటున్నాడు. రెండు నెలల క్రితం కొణికి వచ్చిన షారుఖ్ షేక్ (16) అన్నయ్యతో కలిసి ఉంటున్నాడు. సోమవారం చెరువులో పడి మృతి చెందాడన్న సమాచారంతో పెదపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అన్న ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుల పింఛన్ డబ్బులు కాజేసిన వ్యక్తి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

తణుకు, మార్చి4: పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఈ నెల 1న వృద్ధులకు మాయమాటలు చెప్పి పింఛన్ డబ్బులు కాజేసిన వ్యక్తిని అరెస్టు చేశామని, సీఐ ఎం.నాగరాజు తెలిపారు. సోమవారం విలేకరులకు వివరాలు వెల్లడిస్తూ పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితుడు నాగూర్ మీరావల్లి అనుమానాస్పదంగా కనిపించడంతో అరెస్టు చేశామన్నారు. కొవ్వూరు మండలం పశివేదలకు చెందిన షేక్ నాగూర్ మీరావల్లి వృద్ధులకు పింఛన్ అధికంగా ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి వారి నుంచి తొమ్మిది వేలు కాజేసినట్టు వివరించారు. అతడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సుమారు 46 కేసుల్లో నిందితుడుగా ఉన్నాడన్నారు. ఏటీఎం కార్డుల మార్పిడి, బ్యాంకు ఖాతాదారులకు మాయమాటలు చెప్పి డబ్బులు కాజేయడం, ప్రభుత్వ పథకాల పేరుతో మోసాలు వంటి నేరాలలో నిందితుడని వివరించారు. 2011 నుంచి పలుమార్లు జైలుకు వెళ్లినా అతనిలో మార్పు రాలేదన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి ఈ నెల 13న విడుదలైనట్లు చెప్పారు. ఎస్ఐలు పి.అప్పారావు, కె.శ్రీనివాసు, పీసీలు ప్రసాదు, ఉదయకుమార్, మురళి, వీర్రాజులను ఆయన అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత



చింతలపూడి, మార్చి 4:యర్రగుంటపల్లిలో కఠారి వాణి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రెండున్నర టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు తమకు వచ్చిన సమాచారంతో బియ్యాన్ని పట్టుకుని సివిల్ సప్లై అధికారులకు పంపి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

అత్తిలి : రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు కె.సముద్రపు గట్టు వద్ద ఏపీ 37 టీడీ 1498 నెంబరు మహేంద్ర ఆల్ఫాప్లస్ వాహనంలో తరలిస్తున్న 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్సు, రెవెన్యూ పౌర సరఫరా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ కొత్యాల అనిల్‌కుమార్‌ను అధికారులు ప్రశ్నించగా రేషన్ బియ్యం, వాహనం అత్తిలికి చెందిన ఇర్రి గౌరీ శంకర్‌కు చెందినవని తెలిపారు. రేషన్ బియ్యాన్ని కార్డుదారుల వద్ద కిలో రూ.20కు కొనుగోలు చేసి తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన బాషాకు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు తెలిపారు. రూ.44 వేల బియ్యాన్ని, లక్షా 20 వేల వాహనం సీజ్ చేసి ఇర్రి గౌరీశంకర్, కొత్యాల అనిల్‌కుమార్, బాషాలపై నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, అత్తిలి సీఎస్‌డీటీ టి.సుబ్రమణ్యం, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.


పాలకొల్లు టౌన్: పాలకొల్లు పట్టణం, పోడూరు మండలంలో సోమవారం ఏలూరు రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాల మేరకు విజిలెన్స్, రెవెన్యూ అధికారులు అక్రమ రేషన్ బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. పాలకొల్లు పట్టణం ఎల్ఆర్‌పేట రెండో వీధిలో తాడికొండ వెంకట కృష్ణారావు అక్రమంగా నిల్వ ఉంచిన పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కవిటం లాకుపేట గ్రంధి కేశవ కనకం దుకాణంలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరి ఇద్దరి మీద 6ఏ కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్ఐ సీహెచ్ రంజిత్‌కుమార్ తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏవో సురేష్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉక్కపోతలు.. విద్యుత్ కోతలతో విలవిల

ఏలూరుసిటీ, మార్చి 4: జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. మూడు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 37 డిగ్రీలు నమోదవుతున్నాయి. దీంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. అప్రకటిత విద్యుత్ కోతల వల్ల ప్రజలు విలవిలలాడుతున్నారు. రెండు రోజులుగా విద్యుత్ వినియోగం భారీగానే పెరుగుతోంది. ఏప్రిల్‌లో వచ్చే విద్యుత్ వినియోగం ఇప్పుడే నమోదయ్యింది. మార్చిలోనే ఎండలు మండుతుండటంతో విద్యుత్ కోతలు అప్పుడే మొదలయ్యాయి. దీంతో వృద్ధులు, పిల్లలు ఉక్కబోత, దోమల బెడద తట్టుకోలేక నానా అవస్థలు పడు తున్నారు.

పెరిగిన విద్యుత్ డిమాండ్:

ఉమ్మడి పశ్చిమలో మార్చిలో సాధారణంగా కొంచెం తక్కువగానే విద్యుత్ వినియోగం ఉంటుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జిల్లాలో రోజువారీ విద్యుత్ వినియోగం పెరుగుతోంది. విద్యుత్ కోటాకు, వినియోగానికి మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో విద్యుత్ అంతరాయాలు తప్పటం లేదని అధికారులు చెబుతున్నారు. వేడిగాలులు, ఎండల తీవ్రత కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు.



తేదీ	విద్యుత్ కోటా	వినియోగం
1-3-2024	24.536	22.843
2-3-2024	22.697	23.136
3-3-2024	22.411	22.869

కరాటం మద్దతు కోరిన గారపాటి


కరాటం రాంబాబును కలిసిన గారపాటి సీతారామాంజనేయ చౌదరి

బుట్టాయగూడెం, మార్చి 4: ప్రజా సమస్యల పరిష్కారానికి కలసి పని చేద్దామని గారపాటి సీతారామాంజనేయ చౌదరికి కరాటం రాంబాబు హామీ ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి సోమవారం డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబుతో సమావేశమయ్యారు. ఏలూరు పార్లమెంటు పరిధిలోని సమస్యలపైన, పోలవరం సమస్యలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వంతో మంచి సంబంధాలు ఉన్న వ్యక్తి ఏలూరు ఎంపీగా గెలిస్తే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, తనకు మద్దతు ఇవ్వాలని గారపాటి కోరగా కరాటం సానుకూలంగా స్పందించారు. కలసి పనిచేయడానికి ఇద్దరు నిర్ణయించుకున్నారు.

చేబ్రోలులో జనంలోకి జనసేన


ధర్మరాజుకు మహిళల హారతులు

ఉంగుటూరు, మార్చి 4: జనసేన తెలుగుదేశం పార్టీల కూటమి తోనే ప్రజా సమస్యలు తీరే అవకాశం ఉందని నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. చేబ్రోలులో సోమవారం జనంలోకి జనసేన కార్యక్రమం జరిగింది. ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిపక్ష నాయకులు కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి మానసికంగా హింసిస్తున్నారన్నారు. మండల అధ్యక్షుడు పంది రాంబాబు, నగరపాటి ఫణీంద్ర, కలిగట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులను కాపాడాలి


సూచనలు ఇస్తున్న సీడీపీవో పద్మావతి

ఏలూరు కార్పొరేషన్, మార్చి 4: బాలికల హక్కులను పరిరక్షించాలని సీడీపీవో పి.పద్మావతి అన్నారు. స్థానిక లంబాడీపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద సోమవారం బేటి బచావో-బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. పద్మావతి మాట్లాడుతూ 11-18 సంవత్సరాల వయసు కిశోర బాలికల హక్కులను పరిరక్షించుకోవాలన్నారు. ఆడపిల్లల సంరక్షణ కొరకు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఇవ్వడం, ఆరోగ్య పరిరక్షణకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.సత్యనారాయణమ్మ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: యాదవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో కిశోర బాలికలతో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. చట్టాలు, మహిళా హక్కులు, బాల్యవివాహాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. సెక్టార్ సూపర్‌వైజర్ మంగ, మహిళా పోలీస్ సౌఖ్య స్కూల్ ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఎస్ మ్యూజిక్ అకాడమి వార్షికోత్సవం



నాగేశ్వరరావును సత్కరిస్తున్న సభ్యులు

ఏలూరు కల్చరల్, మార్చి 4: ఎందరో విద్యార్థులకు సంగీతంలో శిక్షణ ఇస్తున్న ఎస్పీఎస్ మ్యూజిక్ అకాడమి సేవలు ప్రశంసనీయమని ప్రముఖులు కొనియాడారు. సాహిత్య అకాడమి ప్రాంగణంలో ఎస్పీఎస్ మ్యూజిక్ అకాడమి వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన సంగీత గాత్ర, వాయిద్య సంగీతం ఆకట్టుకుంది. అనంతరం మానవత సంస్థ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావుకు కళా పోషకరత్న, పెదపాటి రామకృష్ణకు కళాసేవరత్న, గంగాభవానికి కళా సరస్వతి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అకాడమి ప్రిన్సిపాల్ ఎస్పీఎస్ వాసు, ఏపీ కల్చరల్ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు, నాట్యాచార్య కె.వి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు


చదరంగం విజేతలు

ఏలూరు స్పోర్ట్స్ మార్చి 4: లయన్స్‌క్లబ్, చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్-15 చదరంగం పోటీలు సోమవారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ఉమాకిరణ్ పోటీలను ప్రారంభించారు. ఉత్సాహంగా క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో సీహెచ్ వివేక్ ప్రథమ, జి.అభిషేక్ అవరహం ద్వితీయ, అనురూప్ మోషే తృతీయ, టి.తన్మయ్‌సాయి 4వ స్థానం, ఎస్.నిత్యశ్రీ 5వ స్థానం సాధించారని అసోసియేషన్ అధ్యక్షుడు జి.యోహానన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీహరి, ఎం.కృష్ణమోహన్, సిహెచ్ శ్రీనివాసరావు, భాస్కర్‌రామం పాల్గొన్నారు. సెక్రటరి జి.హదస్సాఅరుణ పర్యవేక్షించారు.

సైన్స్, ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌లతో విజ్ఞానం


సైన్స్ ఎక్స్‌పో పరిశీలిస్తున్న ఎంఈవోలు

ఏలూరు రూరల్, మార్చి 4: శ్రీరామ్‌నగర్ జింగిల్ బెల్స్ పాఠశాల, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సృజన పేరుతో సైన్స్, ఆర్ట్ ఎక్స్‌పో సోమవారం నిర్వహించారు. విద్యార్థులు పలు సైన్స్ ప్రదర్శనలు, పరికరాలు, చిత్రపటాలను, వస్తువులను ప్రదర్శించారు. ఎంఈవోలు ఎ.రవిప్రకాష్, ఆర్.రంగయ్య ప్రారంభించారు. లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ మోడల్స్, అయోధ్య రామమందిరం, నాణేల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, కళాత్మకతను వెలికితీసేందుకు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వి.సురేష్, కె.విజయలక్ష్మి, కె.వేణుబాబు, ఎల్.వెంకటేశ్వరరావు, కేవీ.రావు, మల్లికార్జునరావు, స్కూల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రక్త నిల్వ కేంద్రం అందుబాటులో ఉండాలి


బ్లడ్ స్టోరేజి సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే

బుట్టాయగూడెం, మార్చి 4: రోగులకు రక్తం అవసరమైనపుడు ఇతర ప్రాంతాలకు వెళ్ళి రక్తాన్ని తీసుకురావలసిన పరిస్థితి లేకుండా అందుబాటులో బ్లడ్ స్టోరేజి సెంటరు ఉండడం అవసరమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన బ్లడ్ స్టోరేజి సెంటరును సోమవారం ఆయన ప్రారంభించారు. ఎంపీపీ కారం శాంతి, తెల్లం రాజ్యలక్ష్మి, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, తెల్లం రమణ, కరాటం ఫణీంద్ర, కలగర నాని, ఆరేటి సత్యనారాయణ, తెల్లం చిన్నారావు, వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిలో మంచినీటి ఫిల్టర్ పాయింట్

కుక్కునూరు, మార్చి 4 : గోదావరి నదిలో కుక్కునూరు వద్ద మంచినీటి ఫిల్టర్ పాయింట్ ఏర్పాటు చేశారు. సర్పంచ్ రావు మీనా మాట్లాడుతూ గోదావరి ఉధృతంగా ప్రవహించడం వలన ఇబ్బంది లేకుండా తాగు నీరు చేశామన్నారు. గోదావరి నీటి మట్టం తగ్గడంతో ఫిల్టర్ పాయింట్ ఏర్పాటు చేయడం ద్వారా శుభ్రమైన తాగునీరు అందించనున్నామని తెలిపారు. పంచాయితీ పరిధిలో మొత్తం 1900 పైగా గోదావరి ట్యాపులు ద్వారా మంచి నీటిని అందిస్తున్నట్లు తెలిపారు.

కావమ్మతల్లి, మారయ్యస్వామి ఉత్సవాలు


కావమ్మతల్లి, మారయ్యస్వామి

ఏలూరు కార్పొరేషన్, మార్చి 4: స్థానిక బెనర్జీపేటలో కావమ్మ తల్లి, మారయ్యస్వామి ఆలయ ఉత్సవాలు ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించనున్నారు. బెస్త యువజన సంఘం అధ్యక్షుడు వి.బాపూజీ సోమవారం వివరాలు తెలిపారు. అభిషేకాలు, అమ్మవారి కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. 17న అఖండ అన్న సమారాధన జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు జగన్మోహన్‌రావు, బుసే శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాస్, మధురబోయిన శ్రీనివాస్, ఎం.మహేష్‌కుమార్, బి.దుర్గారావు, ఎం.కాశేశ్వరరావు, కామాడ చిరంజీవి, తాండ్ర భరత్‌కుమార్, గురిజాల హేమంత్, చంటి, గురిజాల సైమన్, ఇటికల శ్రీనివాస్ ఏర్పాట్లు చేస్తున్నారు.

మంచు ముసుగు



నగరం మంచు ముసుగులో చిక్కుకుంది. నాలుగు రోజులుగా మంచు అధికంగా కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకు దారి కనపడనంతా మంచు దట్టంగా కమ్మేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారు జామున రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, పలు సెంటర్ల వద్ద దట్టమైన పొగమంచు పేరుకుపోవడంతో వాహనాల హెడ్‌లైట్ వెలుతురులో రాకపోకలు సాగిస్తున్నారు. కళాశాల మైదానాలు, అల్లూరి స్టేడియం ప్రాంతాల్లో ఉదయాన్నే వాకింగ్‌తో తడిసి ముద్దవుతున్నారు. నగర పరిసర ప్రాంతాల మామిడి, జీడిమామిడి రైతులు పూత మాడిపోతుందని ఆందోళన చెందుతున్నారు.

- ఏలూరు కార్పొరేషన్




పార్టీలో చేరిన వారితో కలసి చింతమనేని అభివాదం


ఏలూరులో టీడీపీలో చేరిన వారితో బడేటి చంటి


చింతలపూడిలో సూపర్-6 పథకాల ప్రచారం


జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

జయహో బీసీ

నేడు మంగళగిరిలో భారీ బహిరంగ సభ

విజయవంతం చేయాలని టీడీపీ నేతల పిలుపు

ఏలూరు టూటౌన్, మార్చి 4: జయహో బీసీ బహిరంగ సభ మంగళగిరిలో మంగళవారం జరుగనుందని, సభను జయప్రదం చేయాలని జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి, బీసీ సగర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వీరభద్రరావు విజ్ఞప్తి చేశారు. బడేటి క్యాంపు కార్యాలయంలో సోమవారం బీసీ నేతల సమావేశం జరిగింది. జయహో సభలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తారన్నారు. టీడీపీకి బీసీలే వెన్నెముకని, బీసీలంటేనే టీడీపీ అన్నారు. జగన్ ప్రతీ బీసీ కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు లేకుండా చైర్మన్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో బీసీలపై దాడులు అధికమయ్యాయన్నారు. బీసీ కులాలకు న్యాయం జరగాలంటే టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలన్నారు. సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ జి.గణేష్, రెడ్డి రాంబాబు, జిల్లా కన్వీనర్ రామకృష్ణ, రెడ్డి రామకృష్ణ, జంపా సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: టీడీపీ ఆధ్వర్యంలో మంగళగిరిలో జరగనున్న జయహో బీసీ బహిరంగ సభను జయప్రదం చేయాలని టీడీపీ అధికార ప్రతినిధి దాసరి శేషు పిలుపునిచ్చారు. పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు పాకనాటి అంజి ఆధ్వర్యంలో బీసీ నేతలు సమావేశం నిర్వహించారు. దాసరి శ్యామ్ చంద్రశేషు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు మాట్లాడుతూ నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా సభ జరుగుతుందన్నారు. బీసీ వర్గాల వారంతా సభను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో కోనేటి చంటి, గెడా సుబ్రహ్మణ్యం, కొంచాడ ఉమా ప్రసాద్, నీలమంతుల రాంబాబు, మారిశెట్టి బాలకృష్ణ, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసలు

ఏలూరు టూటౌన్: జగన్ పాలనను భరించలేక టీడీపీలోకి వలసలు జరుగుతున్నాయి. 46, 47, 1వ డివిజన్స్‌లోని వైసీపీ, ఇతర పార్టీల కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో పార్టీ టీడీపీ కండువాలతో చంటి స్వాగతం పలికారు. చంటి మాట్లాడుతూ వైసీపీ పాలనతో విసిగిపోయి సోమవారం ఒక్కరోజే వెయ్యి మందికి పైగా టీడీపీలో చేరారన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఎమ్మెల్యే నాని శిలాఫలకాల పేరుతో ప్రజలను మోసగిస్తున్నారని రానున్న ఎన్నికల్లో నాని ఎత్తుగడలు తిప్పికొట్టాలన్నారు. జగనన్న ఇళ్ల పేరుతో లబ్ధిదారుల నుంచి రూ.35 వేలు దోచారన్నారు. టిడ్కో గృహాలను అందజేయలేదన్నారు. జనసేన కార్యకర్తలు నాయుడు సోము ఆధ్వర్యంలో చంటిని కలిసి మద్దతు తెలిపారు.

● పెదవేగి: కొల్లేరు రక్షణ, లంక గ్రామాల ప్రజల సంరక్షణ ధ్యేయంగా కృషి చేశానని, ఇకపై కూడా అలాగే చేస్తానని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గుడివాకలంక గ్రామానికి చెందిన 50 మంది వైసీపీకి చెందిన నేతలు చింతమనేని సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి చింతమనేని టీడీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రభాకర్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా కొల్లేరు గ్రామాల అభివృద్ధికి కృషి చేశానన్నారు. టీడీపీ, జనసేన కూటమిలో కొల్లేటి ప్రజల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. టీడీపీతోనే కొల్లేటి గ్రామాల ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయనే నమ్మకంతోనే టీడీపీలోకి వచ్చామని పార్టీలో చేరిన గుడివాకలంక నాయకులు పేర్కొన్నారు. ఘంటసాల నాగరాజు, భద్రాజీ, కరుణ, భలే చక్రవర్తి, సైదు అర్జయ్య, త్రిమూర్తులు, నాగబాబు, మోరు రామలక్ష్మణ, శ్రీరాములు, భరతరాజు, నానీ, మల్లుల రాంబాబు, మల్లుల పాండు, మోరు పాండు, విజయ్, భూసి, సంజయ్, జయమంగళ సాయి, వంశీ, సంతోష్, ముంగర వెంకన్న, శ్రీను, నేపాల జగపతి తదితరులు 50మంది వరకు టీడీపీ తీర్థం పుచుకున్నారు. నంబూరి నాగరాజు, మోరు శ్రావణి, ఘంటసాల వెంకటలక్ష్మి, కుటుంబరావు, సుబ్బరాజు, సైదు సత్యనారాయణ, నేతల రవి, పైడిపాటి శేఖర్, జయమంగళ దొరబాబు, మోరు విజయ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన విజయానికి కృషి చేయాలి

చింతలపూడి: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన విజయానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఐటీడీపీ మండల అధ్యక్షుడు బాణావతు ఉమా శంకర్ అన్నారు. సూపర్-6 పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. చదువు కుంటున్న పిల్లలకు రూ. 15 వేలు చొప్పున అందుతాయని, ప్రతీ మహిళకు నెలకు రూ.1500 వస్తాయని, మహిళలకు ఉచితంగా ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం ఉంటుందని, రైతుకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందుతాయని వివరిస్తూ బాబు షూరిటీ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇస్లావత్ నాగేశ్వరరావు, దరావత్ ప్రభాకర్, జనసేన నాయకులు భూక్యా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండలపర్రులో గన్ని రచ్చబండ

నిడమర్రు: రాబోయే ఎన్నికలలో సైకో పాలన తరిమి కొట్టి వైసీపీకి గుణపాఠం చెప్పాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. మండలపర్రులో పార్టీ శ్రేణులతో కలసి రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. రాబోయే ఎన్నికలలో టీడీపీ, జనసేన కూటమికి పలికి ఓటు వేయాలని కోరారు. కార్యకర్తలతో కలసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో తమ్మినీడి నక్షత్రం, పోశింశెట్టి రాంమూర్తి, ముత్యాల స్వామి, పొట్నూరి సింహాచలం, గఫార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలను ఇంటికి పంపించాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు


సీపీఐ జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ళ నాగేశ్వరరావు

బుట్టాయగూడెం, మార్చి 4: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి ప్రభుత్వాలను ఇంటికి పంపవలసిన సమయం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. బుట్టాయగూడెంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అధ్యక్షతన సోమవారం జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాలతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యలపై ప్రశ్నించేవారి గొంతు నొక్కుతున్నారని, అక్రమ కేసులు పెట్టి జైళ్లపాలు చేస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి అదాని, అంబానీలకు దోచిపెడుతున్నారని, మోదీ పాలనలో 95 శాతం ప్రభుత్వరంగ సంస్థలు ప్రవేటుపరం అయ్యాయన్నారు. మిగిలిన 5 శాతం ప్రభుత్వ కంపెనీలను అందరం కలసి కట్టుగా కాపాడుకోవాలన్నారు. రూ.450 గ్యాస్ సిలిండర్ మోదీ పుణ్యమా అంటూ రూ.1000 అయ్యిందని, అన్ని వస్తువుల ధరలు పెరిగినట్లు తెలిపారు. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి మోదీ చేయని ప్రయత్నాలు లేవని విమర్శించారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నవారికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఆదివాసీల తరపున సీపీఐ పోరాటాలు చేసి అనేక సమస్యలకు పరిష్కారం చూపినట్లు తెలిపారు. ఇళ్ల స్థలాలు, పోడు భూముల సమస్యలను ఇతర సమస్యలపై గిరిజనులతో కలిసి పోరాటాలు చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమితో కలిసి పోలవరం ఎస్టీ అసెంబ్లీ స్థానంలో సీపీఐ పోటీ చేస్తుందని ప్రతి కార్యకర్త విజయం కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండి వెంకటేశ్వరావు, ఉప్పులూరి హేమ శంకర్, ఎండి మునీర్, బాడిస రాము, వెంకటచారి, జె.శ్రీనివాసరావు, కె.గురవయ్య, కె.బేబి, జేవి రమణరాజు, కారం దారయ్య, జి.బాలఏసు, వి.శ్యామల, ఎం.యామిని, ఎం.విజయ, కుంచె వసంతరావు కళాకారులు టి.విశ్వేశ్వరావు, ఎం.అలెగ్జాండర్, టీవీఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 4: ఉగాది సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని కవులు, కళాకారులు, రచయితలు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, యోగా గురువులు, క్రీడాకారులకు హైదరాబాద్‌లోని సంస్థ పురస్కారాలు ఇవ్వనుంది. శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కారాలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈఎస్ఎస్.నారాయణ సోమవారం తెలిపారు. సంబంధిత రంగాల్లో ప్రతిభావంతుల సేవలను, ప్రతిభను తెలియజేసే సర్టిఫికెట్లు, ఫోటోలు, పత్రికల క్లిప్పింగ్స్, గతంలో పొందిన పురస్కారాల సర్టిఫికెట్లు, ఫొటోల ప్రతులను దరఖాస్తుకు జతచేసి ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్‌నెంబరు 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రాబాద్-15 చిరునామాకు ఈ నెల 15వతేదీలోగా పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్‌నెంబరు 96523 47207లో సంప్రదించాలని సూచించారు.

రహదారి నిర్మాణానికి నిధులు ఇవ్వండి


వినతిపత్రం ఇస్తున్న పద్మశ్రీ

పెదపాడు, మార్చి 4: సత్యవోలు - వడ్డిగూడెం రహదారి నిర్మాణానికి ప్రధానమంత్రి సడక్ యోజన -3లో రూ.4.33 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పంచాయతీరాజ్ రూరల్ డవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ వద్ద ప్రతిపాదన పెండింగ్‌లో ఉందన్నారు. మంజూరుకు చర్యలు తీసుకోవా లని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌కు సోమవారం ఆమె వినతిపత్రాన్ని అందజేశారు.

నెక్లెస్ బండ్ పునరుద్ధరించాలని రైతుల వినతి

పోలవరం, మార్చి 4: పోలవరం గ్రామానికి రక్షణగా నిర్మించిన నెక్లెస్ బండ్ పునరుద్ధరణ పనులు సత్వరం చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొణతాల ప్రసాద్, రైతులు సోమవారం స్పందనలో అర్జీ అందజేశారు. నెక్లెస్ బండ్ పలుచోట్ల బలహీన పడిందన్నారు. అధికారులు ముందుగా స్పందించి పాత పోలవరం నుంచి యడ్లగూడెం వరకూ పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రానున్న వరదల సందర్భాలలో నెక్లెస్ బండ్ కోతకు గురయ్యే అవకాశాలున్నాయని, అధికారులు స్పందించి రానున్న సీజన్‌లో ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

టీడీపీ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ



ఏలూరు టూటౌన్, మార్చి 4: టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చింతలపూడి నియోజకవర్గానికి చెందిన భూమరాజు సత్యనారాయణ నియమితులయ్యారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.దుర్గారావు నియమితులయ్యారు.

పల్స్ పోలియో సద్వినియోగం చేసుకోండి

లింగపాలెం, మార్చి 4: కె.గోకవరంలో డాక్టర్ కృష్ణకిషోర్, డాక్టర్ నైమిష, డాక్టర్ ప్రీతి ఆధ్వర్యంలో పల్స్ పోలియో చుక్కల మందును ఐదేళ్లల్లోపు బాలబాలికలకు అందించారు. మిగిలివారికి కూడా పోలియో చుక్కలు వేయడానికి చర్యలు చేపట్టారు. మంగళవారం వరకు ఏఎన్ఎంలు, ఆశాలు గ్రామంలోని ప్రతి ఒక్కరి ఇళ్లకు వెళ్ళి ఐదేళ్లల్లోపు బాలలను గుర్తించి పోలియో చుక్కలు వేయాలన్నారు. రెండుచుక్కలు భవిష్యత్తుకు పునాది అని అన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సాయుధ బలగాల కవాతు


జంగారెడ్డిగూడెం పట్టణంలో సీఏస్ఎఫ్ సిబ్బంది కవాతు


ఏలూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, సాయుధ బలగాలు

నగరం, పట్టణాల్లో ఎన్నికల చప్పుడు వినపడుతోంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లాకు వచ్చిన మిలటరీ దళాలు జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలోని వేగవరం నోవా కాలేజ్‌లో బస చేశాయి. ఏలూరు సబ్ డివిజన్ పరిధి బలగాలు ఏలూరులోనే బస చేస్తున్నారు. ప్రజల్లో ఆత్మస్థైర్యం కల్పించేందుకు రక్షణ చర్యల్లో భాగంగా సాయుధ బలగాలు ఏలూరు నగరంలో సోమవారం కవాతు నిర్వహించారు. డీఎస్పీ ఈ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, టూటౌన్ సీఐ ప్రభాకర్, సిబ్బంది, సాయుధబలగాలు కవాతులో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. జంగారెడ్డిగూడెం ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు సీఏస్ఎఫ్ దళాలు రంగంలో దిగాయి. పట్టణంలో సీఏస్ఎఫ్ దళంతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించినట్లు ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్.సురేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో డివిజన్‌కు 90 మంది సీఏస్ఎఫ్ సిబ్బంది వచ్చినట్లు తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేందుకు పూర్తి చర్యలు చేపడతామన్నారు.

- జంగారెడ్డిగూడెం టౌన్ / ఏలూరు క్రైం


దివ్య బలిపూజ నిర్వహిస్తున్న ఏలూరు బిషప్ పొలిమేర జయరావు

ముగిసిన లూర్దుమాత ఉత్సవాలు

కామవరపుకోట, మార్చి 4: తడికలపూడిలోని హైస్కూలు రోడ్డులో కొండగట్టుపై లూర్దుమాత ఆలయం వద్ద నాలుగు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ముగింపు సందర్భంగా ఏలూరు బిషప్ పొలిమేర జయరావు దివ్య బలిపూజ నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన రెవరెండ్ ఫాదర్స్, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. లూర్దుమాత మందిరం నిర్వాహకులు దేవతోటి నతానియేలు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. మందిరం వద్ద క్రైస్తవ గీతాలాపనలు, క్రైస్తవ సందేశాలతో భక్తులతో కిటకిటలాడింది. లూర్దుమాత అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు గీతాలను ఆలపిస్తూ పయనించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందికి జరిమానా

ఏలూరు క్రైం, మార్చి 4 : మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందికి జరిమానా విధిస్తూ ఏలూరులోని మొబైల్‌కోర్టు మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ఏలూరు ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 13 మందిని మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వారిని సోమవారం మొబైల్‌కోర్టులో హాజరుపర్చగా ఒకొక్కరికి పది వేల రూపాయలు జరిమానా విధించారు. మొత్తం రూ.1.3లక్షల జరిమానా చెల్లించారు.

కోడి పందేలపై దాడి : 16 మంది అరెస్ట్

పెదవేగి, మార్చి 4: రామశింగవరంలో కోడిపందేలు వేస్తున్న సమాచారంతో దాడిచేసి 16 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. వారి నుంచి ఆరు కోడిపుంజులు, రూ.1800 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపర్చుతామని ఆయన తెలిపారు.

సారా తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు

టి.నరసాపురం, మార్చి 4: సారా తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. అల్లంచర్లరాజుపాలెం పంచాయతీ కొత్తగూడెం గ్రామ శివారులోని అటవీ భూమిలో సారా తయారు చేస్తున్నారనే సమాచారంతో సోమవారం దాడి చేశారు. ఒకరిని అదుపులోకి తీసుకుని మోటార్ సైకిల్, 40 లీటర్ల సారా, తయారీ సామగ్రి స్వాధీనం చేసుకుని, బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

కుక్కునూరు, మార్చి 4: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు సత్యేంద్రబాబు అన్నారు. సోమవారం కుక్కునూరులో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల నుంచి 70 మంది కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గజ్జి రాజులు, కొల్లూరి సత్యనారాయణ, వడ్డే రఘు నాయుడు, సమ్మయ్య గౌడ్, కె.రాజారత్నం, కొల్లి రామసూరి రెడ్డి, ఏసుబాబు, సింగిరెడ్డి రామకృష్ణారెడ్డి, మాచర్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి తపనా ఆర్థిక సాయం

కుక్కునూరు, మార్చి 4: మండలంలోని బెస్తగూడెంలో థైరాయిడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న శ్రీరాముల అపర్ణకు తపనా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి ద్వారా ఆర్థిక సహాయం అందించారు. బీజేపీ మండల కోశాధికారి వాడపల్లి లక్ష్మణాచార్యులు సోమవారం రూ.25 వేలు నగదు అందజేశారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా తపనా చౌదరి బెస్తగూడెంలో పల్లె నిద్ర చేసిన సందర్భంలో బాధితురాలి గురించి తపన చౌదరి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కట్ట సతీష్, కోమళ్ళ బిక్షమాచారి, తడబోయిన నరేష్, కోమాళ్ళ నాగబాబు పాల్గొన్నారు.

ముగిసిన ఈ-పంట నమోదు ప్రక్రియ

భీమడోలు, మార్చి 4: మండలంలో రబీ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు ప్రక్రియ ముగిసినట్లు ఏవో ఉషారాణి తెలిపారు. పంట నమోదుకు సంబంధించిన సామాజిక తనిఖీ జాబితాలను ఆయా ఆర్బీకే కేంద్రాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. ఈనెల 5 వరకూ దీనికి సంబంధించి గ్రామ సభ నిర్వహిస్తామని రైతులు అభ్యంతరాలు ఉంటే రైతు భరోసా సిబ్బందికి తెలియజేయా లన్నారు. మండలంలో 13159.47 ఎకరాల్లో 4498 మంది రైతులకు సంబంధించిన పంట నమోదు పూర్తి చేశామన్నారు.

సాయి మందిర్ వార్షికోత్సవం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 4: శనివారపుపేట శ్రీరామ్‌నగర్‌లో షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం కాకడ హారతి, మధ్యాహ్న హారతి, సంధ్య హారతి, శేజ్ హారతి ఇచ్చి ఆరాధించారు. 108 రోజుల బాబా పారాయణ గ్రంథ శ్రవణం, బాల అష్టోత్తర శతనామ పుష్పాల పూజ నిర్వహించారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కామినేని


కాత్రేనిపాడులో నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి


భైరవపట్నంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు

అమరావతిని నిర్వీర్యం చేసిన జగన్

» ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి కామినేని

కలిదిండి, మార్చి 4 : రాష్ట్ర రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసి మూడు రాజధానులంటూ మూడు ముక్కలాడుతున్న సీఎం జగన్‌ను సాగనంపాలని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం సంతోషపురం, భాస్కరరావుపేట గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సచివాలయాన్ని తాకట్టు పెట్టి రూ.370 కోట్లు అప్పు తీసుకోవటం దారుణమన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు లేకపోవటంతో పక్క రాష్ట్రాలకు తరలిపో తున్నారన్నారు. పోలవరం పూర్తి చేయకపోవటంతో సాగునీటి కొరత ఏర్పడి రైతులు నష్టపోయారన్నారు. లంక గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులకు వంతు కూడా సక్రమంగా ఇవ్వకపోవటంతో పూర్తిస్థాయిలో తాగునీటి చెరువు నిండక గ్రామాల్లో రెండు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారన్నారు. రోడ్లు గోతులతో అధ్వానంగా ఉన్నాయని, అదేమని ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నారన్నారు. కొండంగి లాకుల వద్ద ఉప్పుటేరుపై రూ.13 కోట్లతో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసిన ఘనత తనదేనన్నారు. ఈ పథకాల ద్వారా చేపల, రొయ్యల చెరువులకు సాగునీరు సరఫరా చేస్తున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే విజన్ ఉన్న క్రమశిక్షణ కలిగిన మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, తాడినాడ బాబు, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, అంద్రాజు శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చక్రవర్తి, మాజీ సర్పంచ్ మంతెన సుబ్బరాజు, డీసీ మాజీ ఛైర్మన్లు సారిక వెంకటేశ్వరరావు, ముద్దం భోగేశ్వరరావు, జనసేన నాయకుడు నల్లగోపుల చలపతిరావు, బీజేపీ నాయకులు పైడిపాడి శివశంకర్, పేటేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. తొలుత టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు.

టీడీపీ విజయానికి సమష్టి కృషి : కొలుసు

ముసునూరు: నూజివీడులో టీడీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి కోరారు. సోమవారం రాత్రి కాత్రేనిపాడులో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామంలో పార్టీ పరిస్థితి, సమస్యలపై పార్టీ సీనియర్ టీడీపీ నాయకుడు బొమ్మగంటి శ్యామలరావు, సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్‌రావు, ఉప సర్పంచ్ రాపర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ తదితరులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాత్రేనిపాడు టీడీపీకి కంచుకోట అని రానున్న ఎన్నికల్లో మంచి మెజార్టీ వచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో విజయం ఫిక్స్: కమ్మిలి

మండవల్లి: వైసీపీ అసమర్థ పాలనతో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. మండవల్లి మండలం భైరవపట్నంలో టీడీపీ మండవల్లి మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దోచుకోవడం దాచుకోవడం తప్ప వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. మరోసారి జగన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజలు అవయవాలను అమ్ముకోవాల్సిన దౌర్భాగ్యం ఏర్పడుతుందన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలందరికీ టీడీపీ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందేలా చూడాలని పిలుపునిచ్చారు. టీడీపీ విజయం కోసం ప్రతి ఒక్కరూ అలుపెరగని పోరాటం చేయాలని కోరారు. మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, టీడీపీ నాయకులు కొడాలి వినోద్, పెన్మెత్స వెంకటేశ్వరరాజు, బలే ఏసురాజు, పెన్మెత్స త్రినాథరాజు, తేరా రమేష్, కూనపురెడ్డి కోటేశ్వరరావు, ముళ్లపూడి సత్తిబాబు, తలారి రాజేష్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


అటపాకలో జనసేన-టీడీపీ నాయకుల కరపత్రాల పంపిణీ

జనంలోకి జనసేన ప్రారంభం

కైకలూరు: సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకెంతో మేలు చేస్తాయని జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్ అన్నారు. సోమవారం అటపాకలో జనంలోకి జనసేన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలతో పాటు గతంలో టీడీపీ చేసిన అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేయబోయే పనులను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. జనసేన నాయకులు మాట్లాడుతూ టీడీపీ-జనసేన అధికారంలోకి వస్తే గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, ఆక్వా రంగం, రైతులకు మేలు జరిగేలా చూస్తామన్నారు. టీడీపీ వడ్డి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బలే ఏసురాజు, కార్యవర్గ సభ్యుడు జయమంగళ సుబ్బరాజు సంఘీభావం తెలిపారు. వీర మహిళలు తోట లక్ష్మి, శొంఠి రాజేశ్వరి, ముదినేపల్లి మండల అధ్యక్షుడు వీరంకి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు మేడేపల్లి హనుమాన్, కిషోర్, పుప్పాల సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని..

మోకాళ్లపై నిలబడి నిరసన



నూజివీడు టౌన్, మార్చి 4: వ్యవసాయ విద్యుత్ సరఫరా పునరుద్ధరించటంలో విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ నూజివీడు ఈఈ కార్యాలయం వద్ద రైతు కుటుంబంతో కలసి నిరసన తెలిపాడు. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం వీరరాఘవాపురం గ్రామానికి చెందిన గాదే పూర్ణచంద్రరావుకు చెందిన వ్యవసాయ భూమిలో విద్యుత్ కనెక్షన్ ఉంది. అయితే 40 రోజుల క్రితం సర్వీస్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా, ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తానని చెప్పి ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నచోట కనెక్షన్ ఇవ్వకుండా విద్యుత్ శాఖ అధికారులు తాత్సారం చేస్తున్నారని, అదేమంటే పక్క రైతులతో వివాదం ఉందని పేర్కొంటూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించటం తమ భూమిలోని పామాయిల్ మొక్కలు ఎండిపోతున్నాయని తక్షణం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని బాధిత రైతు గాదే పూర్ణచంద్రరావు ఈఈ కార్యాలయం వద్ద మోకాళ్ళపై నిలబడి నిరసన తెలిపాడు. తక్షణం సర్వీసును పునరుద్ధరించాలని కోరాడు.

ఇంటర్ పరీక్షలు తనిఖీ చేసిన స్పెషల్ స్క్వాడ్

ముదినేపల్లి, మార్చి 4 : ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని సోమవారం ముగ్గురు అధికారులతో కూడిన ప్రత్యేక బృందం ఆకస్మిక తనిఖీ చేసింది. ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షల నిర్వహణను పరిశీలించింది. భీమడోలు తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ద్వారకా తిరుమల సాంఘిక సంక్షేమశాఖ కళాశాల పీడీ శ్రీలక్ష్మి, చేబ్రోలు ఏఎస్ఐ సాంబశివరావుతో కూడిన స్పెషల్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, ఈ పరీక్షా కేంద్రంలో సోమవారం 162 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 9 మంది హాజరు కాలేదని చీఫ్ సూపరింటెండెంట్ ఓరుగంటి సత్యనారాయణ మూర్తి, డిపార్ట్‌మెంట్ అధికారి కేవీవీ నాగేశ్వరరావు తెలిపారు.

స్పందనకు 10 అర్జీలు: ఆర్డీవో

నూజివీడు టౌన్, మార్చి 4: స్పందన కార్యక్రమంలో పది అర్జీలు దాఖలైనట్లు నూజివీడు ఆర్డీవో భవానీ శంకరి తెలిపారు. నూజివీడు డివిజన్ వ్యాప్తంగా వివిధ సమస్యలపై వస్తున్న అర్జీలను అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆమె పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు


పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో

కలిదిండి, మార్చి 4 : కలిదిండి కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ప్రభాకర్ బాబు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఆధునిక వసతులతో టాయ్‌లెట్స్ ఉన్నప్పటికీ విద్యార్థులు ఉపయోగించుకోకుండా బయటకు వెళ్తున్నారని తెలిసిందని, దీంతో ఉపాధ్యాయులు సర వినోదని, నాగమణిలను మందలించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు.

టీడీపీ చాట్రాయి మండల అధ్యక్షురాలిగా వరలక్ష్మి



చాట్రాయి, మార్చి 4: టీడీపీ చాట్రాయి మండల అధ్యక్షురాలిగా చీపురుగూడెం గ్రామానికి చెందిన బొట్టు వరలక్ష్మిని నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. దివంగత మండల టీడీపీ అధ్యక్షుడు బొట్టు విజయ చౌదరి భార్య వరలక్ష్మి. ప్రస్తుతం మరిడి వెంకటేశ్వరరావు(చిట్టిబాబు) మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. వరలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసి, అందరి సహకారంతో రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు.


నూజివీడులో మాట్లాడుతున్న న్యాయవాది పద్మాంజలి


కైకలూరులో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ ఇన్‌చార్జి లావణ్య

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

నూజివీడు, మార్చి 4: బాల్య వివాహాలు చేసినా, వరకట్నం తీసుకున్నా చట్టప్రకారం కఠిన శిక్షలు తప్పవని న్యాయవాది నందూరి పద్మాంజలి అన్నారు. నూజివీడులో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు, బహు భార్యత్వం, వరకట్నం వంటి దురాచారాలను చట్టప్రకారం నిషేధించినా అవి సమాజంలో ఎక్కడో ఒకచోట కొనసాగుతున్నాయని మహిళలు సంఘటితంగా వాటిని వ్యతిరేకిస్తూ పోరాటం చేయాలన్నారు. ఈ సందర్భంగా సీడీపీవో షేక్ నూరానీ మాట్లాడుతూ మహిళలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే భవిష్యత్ సమాజం ఆరోగ్య వంతంగా ఉంటుందన్నారు. గర్భిణులు, బాలింతలు, పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శుభప్రియ, వెలుగు ఏపీఎం రాజశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: బాల్య వివాహాలు నేరమని, ఎక్కడైనా జరిపేందుకు యత్నిస్తే ప్రజలు ప్రభుత్వ అధికారుల దృష్టికి తేవాలని ఇన్‌చార్జి ఐసీడీఎస్ ఆఫీసర్ లావణ్య అన్నారు. సోమవారం కైకలూరు వెలమపేట ఎంపీ యూపీ పాఠశాలలో బాల్య వివాహాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండే వరకు పెళ్లి చేయకూడదని, అలా చేసేందుకు యత్నిస్తే తమ తల్లిదండ్రులపై సైతం పిల్లలు ఫిర్యాదు చేయవచ్చన్నారు. బాల్య వివాహాల వల్ల పుట్టే పిల్లల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తద్వారా వారి జీవితకాలం బాధపడాల్సి వస్తుందన్నారు. ప్రతి రోజూ బాలికలు పౌష్టికాహారాన్ని తీసుకుని రక్తహీనత లేకుండా చూసుకోవాలని సూచించారు. విద్యార్థి దశలోనే బాలికలు సమాజం పట్ల అవగాహన కలిగి చైతన్యవంతులుగా మారాలన్నారు. సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్‌వాడీ టీచర్ ఎల్. మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

బలివే ఉత్సవాలకు ఏర్పాట్ల పరిశీలన


ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న రీజనల్ జాయింట్ కమిషనర్ విజయరాజు

ముసునూరు, మార్చి 4: బలివే రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా అధికారి సీహెచ్. రంగారావుతో కలసి రీజనల్ జాయింట్ కమిషనర్ మేడేపల్లి విజయరాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తుల క్యూలైన్‌లకు ఏర్పాటు చేసిన బారికేడ్లు, ప్రసాదాల తయారీ, జల్లు స్నానాలతోపాటు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సౌకర్యాలను పరిశీలించారు. ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలన్నారు. తొలుత స్వామివారిని విజయరాజు, రంగారావు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఈవో సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏర్పాట్లపై సమావేశం..

బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై మంగళవారం నూజివీడు ఆర్డీవో భవానీ శంకరి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరుగుతుందని ఆలయ ఈవో సతీష్‌కుమార్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

జయహో బీసీ సభను విజయవంతం చేయండి

కైకలూరు, మార్చి 4: నాగార్జున వర్సిటీ సమీపాన మంగళవారం జరిగే జయహో బీసీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. సోమవారం ఆయన కైకలూరు పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తెచ్చి వారి అభ్యున్నతికి కృషి చేస్తామని మేనిఫెస్టోలో చంద్రబాబు ప్రకటించారన్నారు. అలాగే జయహో బీసీ సభలో బీసీలకు ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించి వారు ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తారన్నారు. మంగళవారం మధ్యాహ్నం గుంటూరు జిల్లా కాజ గ్రామంలోని నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న స్థలంలో జయహో బీసీ భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారని, కైకలూరు నియోజకవర్గం నుంచి బీసీలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్‌పై నుంచి పడి కూలీ దుర్మరణం

ముసునూరు, మార్చి 4: ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడు మృతి చెందిన ఘటనపై సోమవారం ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బర్మా రాంబాబు(32) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మొక్కజొన్న లోడు చేసేందుకు కూలీకి వెళ్ళాడు. అయితే మొక్కజొన్న లోడ్‌ను చెక్కపల్లిలో అన్‌లోడ్ చేసి తిరిగి అక్కిరెడ్డిగూడెం వస్తుండగా చెక్కపల్లి శివారులో రహదారి మధ్యలో ఉన్న గుంతలోకి ట్రాక్టర్ వెళ్ళడంతో ఇంజన్‌పై కూర్చున్న రాంబాబు ప్రమాదవశాత్తు రహదారిపై పడిపోయాడు. ఈ ఘటనలో రాంబాబు తలకు తీవ్రగాయమైంది. దీంతో నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి రాంబాబును తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

30 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



చాట్రాయి, మార్చి 4: మండలంలోని పోలవరం గ్రామం వద్ద, కాకినాడకు అక్రమంగా రవాణా అవుతున్న 30 టన్నుల రేషన్ బియ్యం లారీని సోమవారం జిల్లా పౌర సరఫరాల అధికారి సత్యనారాయణ పట్టుకున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు డీఎస్‌వో సత్యనారాయణ, నూజివీడు డీటీ వెంకటేశ్వరరావు పోలవరం వద్ద వాహనాలు తనిఖీ చేయగా టీఎస్05యూసీ2829 నంబరు లారీలో రేషన్ బియ్యం గుర్తించి, వీఆర్వో శేషకుమారితో పంచనామా నిర్వహించి బియ్యం స్వాధీనం చేసుకుని లారీని సీజ్ చేశారు. లారీ డ్రైవర్ రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని, సదరు బియ్యం పి. రామచంద్రరావు, కె. శివదీప్‌లకు చెందినవిగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం



నూజివీడు టౌన్, మార్చి 4: సారా తయారీకి ఉపయోగించే బెల్లపు ఊటను నూజివీడు సెబ్ సిబ్బంది ధ్వంసం చేశారు. నూజివీడు మండలం ఓగిరాల తండాలో నిల్వ ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 35 లీటర్ల సారాను స్వాధీన పరుచుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వెంకట రమణ తెలిపారు.


ముసునూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

అటవీ బంజరు భూములకు పట్టాలివ్వాలి

ముసునూరు, మార్చి 4: పేదలు సాగుచేస్తున్న అటవీ బంజరు భూములకు సాగు హక్కు పట్టాలను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సాగుదారులు, వ్యవసాయ కార్మికులు ర్యాలీ నిర్వహించి, ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ 50 ఏళ్ళుగా అటవీ భూములను సాగు చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పేదలు పట్టాల కోసం అనేక ఉద్యమాలు చేసి అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకున్న నాథుడే లేడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూములను సాగుచేసుకుంటున్న పేదలకు ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, జలకళ, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలు అందడంలేదన్నారు. సీపీఐ నాయకుడు కొమ్మన నాగేశ్వరరావు మాట్లాడుతూ ముసునూరు మండలంలో బలివే, చెక్కపల్లి, వేల్పుచర్ల, అన్నపనేనివారిగూడెం, వెంకటాపురం, గుడిపాడు, కాత్రేనిపాడు, రంగంపేట తదితర గ్రామాల్లో భూ పోరాటాల ద్వారా దక్కిన భూములు సాగు చేస్తున్న పేదలకు ఇప్పటికీ పట్టాలు ఇవ్వకపోవడం ప్రభుత్వాల అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఎమిలికుమారికి వినతపత్రం ఇచ్చారు. ఏఐటీయుసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.


సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పోతురాజు

పెద్దింటమ్మ జాతరను విజయవంతం చేయండి

కైకలూరు, మార్చి 4: కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి జాతర మహోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తహసీల్దార్ ఎస్. పోతురాజు అన్నారు. సోమవారం పెద్దింటమ్మ వారి ఆలయం వద్ద జాతర మహోత్సవాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 24వ తేదీ వరకు జాతర మహోత్సవాలను వైభవంగా జరిపేందుకు అన్ని చర్యలను తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తే జాతర మహోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రతి రోజూ పారిశుధ్య పనులను నిర్వహించేలా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే మంచినీటి వసతికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను అధికారులు చేపట్టాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. కొల్లేటికోట సర్కారు కాలువ వంతెనపై రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ బందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తుల సౌకర్యార్థం ఉచిత దర్శనం, అంతరాలయ దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఈవో కేవీ గోపాలరావు, కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ఈవోపీఆర్డీ ఆర్. రవిశంకర్ రావు, పంచాయతీ కార్యదర్శి కె. శ్రీమన్నారాయణ, జి. వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏఈ సాధిక్ బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబు వివిధ శాఖల అధికారులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

కైకలూరు, మార్చి 4: రహదారి అభివృద్ధితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కైకలూరు శ్రీశ్యామలాంబ ఆలయం నుంచి మార్కెట్‌కు వెళ్లే సీసీ రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, ఎంపీపీ అడవి వెంకట కృష్ణమోహన్, వార్డు సభ్యులు ఎండీ గాలిబ్‌బాబు, తోట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కోరుకొల్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యం


డ్రైనేజీ పూడికతీతను పరిశీలిస్తున్న సర్పంచ్ కనకదుర్గ

కలిదిండి, మార్చి 4 : కోరుకొల్లులో సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. గ్రామంలో డ్రైనేజీల్లో పూడికను తొలగించి బ్లీచింగ్ చల్లారు. అంతర్గత రహదారులపై పేరుకు పోయిన చెత్త కుప్పలను తొలగించారు. వీధిలైట్లు వేశారు. తాగునీటిని క్లోరినేషన్ చేసి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి వార్డులోను స్వచ్ఛభారత్‌ను నిర్వహిస్తున్నామని, స్వచ్ఛ కోరుకొల్లుగా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వై.రాజారావు, వార్డుసభ్యులు నున్న సుబ్రహ్మణ్యం, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సైబర్ నేరగాళ్ల విజృంభణ

» లక్షలాది రూపాయల గల్లంతు » ముదినేపల్లిలో పలువురు బాధితుల లబోదిబో » రికవరీ కాని సొమ్ము

ముదినేపల్లి, మార్చి 4 : సైబర్ నేరాలకు పాల్పడే ముఠా మాటలు నమ్మవద్దని, ఆన్‌లైన్‌లో యాప్‌లు జోలికి పోయి మోసపోవద్దని పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా డబ్బుల ఆశలో పడి విద్యావంతులు సైతం సొమ్ము పోగొట్టుకుంటున్నారు. ముదినేపల్లిలో ఈ నేరాలు ఆరు నెలల కాలంలో మూడు జరిగాయి. స్థానిక అడితీ వ్యాపారి ఒకరు ఒక అపరిచిత వ్యక్తి మాటలు నమ్మి వేరే వ్యక్తి అకౌంట్‌లో ఫోన్ పే ద్వారా ఒక రూపాయి వేయగా, నిమిషాల వ్యవధిలోనే ఆ వ్యాపారి ఖాతా నుంచి రూ.69 వేలు మాయమయ్యాయి. దీనిపై సైబర్ క్రైం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేసినా గల్లంతైన సొమ్ము తిరిగి రాలేదు. ఈ సంఘటన మరువకముందే ముదినేపల్లిలో కంటి ఆసుపత్రిని నిర్వహించే ఒక విద్యావంతుడు ఆన్‌లైన్ లింకులో సొమ్ములు వేసి సుమారు రూ.2 లక్షలు పోగొట్టుకున్నారు. నాలుగు రోజుల క్రితం తాజాగా మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి గత నెల 25న పోస్టు ద్వారా వచ్చిన పార్శిల్‌లో ఒక వ్యాపార సంస్థ నిర్వహించిన షోలో రిజిస్టర్డ్ వ్యక్తులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశామని, ఇందులో స్క్రాచ్ కార్డును ఓపెన్ చేయమని ఉంది. దీంతో పంది మోహనరావు అనే ఆ వ్యక్తి కార్డును ఓపెన్ చేయగా, రూ.15.50 లక్షలు మొదటి బహుమతిని మీరు గెలుచుకున్నారు. టీడీఎస్, ఇతర ఛార్జీల కింద 5 శాతం సొమ్ము చెల్లించాలని బ్యాంక్ అకౌంట్ నంబర్లు ఇచ్చారు. దీంతో ఆ వ్యక్తి రూ.62 వేలు ఇద్దరు వ్యక్తుల ఖాతాలకు పంపారు. అనంతరం అంతకు ముందు మాట్లాడిన వ్యక్తుల ఫోన్ నంబర్లు బంద్ అయ్యాయి. ఇదంతా మోసమని గుర్తించిన మోహనరావు సైబర్ క్రైం పోలీసులకు, ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలా పలు రకాలుగా ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయని ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకుంటూ కూడా సైబర్ నేరస్థుల మాటలను గ్రామీణ ప్రాంత ప్రజలు నమ్ముతూనే ఉన్నారు. కొన్ని సంఘటనలు బయట పడుతుండగా బయటపడనివి ఎన్నో. ఈ మోసాలకు సంబంధించి బ్యాంక్ అకౌంట్లు ఇతర రాష్ట్రాలకు చెందినవిగా కొన్ని కేసుల్లో బయట పడినప్పటికీ సైబర్ క్రైం విభాగం సొమ్మును తిరిగి రాబట్టే అవకాశాలు లేకుండా పోతున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు కూడా సైబర్ మోసాలు వ్యాపించటం ఆందోళన కలిగిస్తున్నది.

మాటలతో మోసం: కోడె వెంకటస్వామి, టింబర్ డిపో యజమాని



ముదినేపల్లిలోని నా అడితీకి వచ్చి నాపరాయి కొనుగోలు చేసినట్లు ఇద్దరు నటించారు. ఒక రూపాయి తమ యజమాని అకౌంట్‌కు ఫోన్ పే చేస్తే సరుకు కొన్న మొత్తం వేస్తారని వారు నమ్మించారు. నేను నా ఫోన్ ద్వారా ఒక రూపాయి వేయగా, పది నిముషాల్లో నా బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.69 వేలు మాయమయ్యాయి.

ప్రైజ్‌మనీ వచ్చిందని: మోహనరావు, ఊటుకూరు



ఆన్‌లైన్‌లో మీ షో యాప్‌లో వస్తువులు ఆర్డర్ పెట్టా. డెలివరీ అయ్యాక సొమ్ము చెల్లించా. అనంతరం లక్కీ డ్రాలో ప్రైజ్ మనీ వచ్చిందంటే నమ్మి టీడీఎస్ ఛార్జీలు రూ.62 వేలు బ్యాంక్ అకౌంట్‌లో వేశా. రూ.15 లక్షలు తన ఖాతాలో వేశామని యాప్ నిర్వాహకులు చెప్పారు. సొమ్ము జమకాలేదు.


ఆధునిక వ్యవసాయానికి సిద్ధం చేసిన పొలం

యువతరం రైతుల..

ఆధునిక సేద్యం

చాట్రాయి, మార్చి 4: గ్రామాల్లో యువ రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ సత్ఫలితాలను సాధిస్తున్నారు. ఇటీవల కాలంలో చదువుకున్న యువకులు కూడా వ్యవసాయ రంగంలోకి వచ్చి తక్కువ శ్రమతో ఆధునిక పద్ధతులు పాటిస్తూ అనువైన పంటలు సాగు చేస్తూ, అధిక దిగుబడులు పొందుతూ లాభాలు ఆర్జించటం విశేషం. ముందుగా భూములను ఆధునిక వ్యవసాయ పద్ధతిలో యంత్రాలతో మడికట్టు కట్టి ప్రతి మడిలోకి ట్రాక్టర్ ఇతర వాహనాలు వెళ్ళేలా దారి ఏర్పాటు చేస్తున్నారు. దీని వల్ల నిత్యం పంటలు పర్యవేక్షించటానికి, ఎరువులు, పురుగు మందులు వేయటానికి, పండిన పంటలు మార్కెట్‌కు తరలించటానికి సులువుగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. రైతులకు సహకార సంఘాలు, బ్యాంకులు రుణాలు ఇస్తుండటంతో ఆధునిక వ్యవసాయానికి ఊతం వస్తున్నది.